ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 నవంబరు 2025

మేడల్లోకి అమ్మవార్ల ప్రవేశం



కుండి సెంటర్‌లో గంగానమ్మ,పోతురాజు,ఆదిమహాలక్ష్మిలతో భక్తులు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):స్థానిక పడమరవీధి ఆది మహా లక్ష్మి, గంగానమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుల జాతరను పురస్కరించు కుని శనివారం ఆదిమహాలక్ష్మమ్మ, గంగానమ్మ అమ్మవార్లను మేళతాళాలు, బాజా భజంత్రీలతో కోలాహలంగా మేడల వద్దకు తీసుకొచ్చి మేడల్లోకి ప్రవేశింపచేశారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో అర్చనలు, నివేదనలు,ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనాకుమారి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లతో పాటు పలువురు మహిళా ప్రతినిధులు, కార్పొరేటర్లు, అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు. జాతర కమిటీ గౌరవాధ్యక్షులు చోడే వెంకటరత్నం, మద్యాహ్నపు మహేశ్వరరావు, నూకల రాజారావు, జాతర కమిటీ అధ్యక్షులు చోడే బాల సుబ్రహ్మణ్యం(బాలు), మద్యాహ్నపు రామకృష్ణదాసు, కోశాధికారి బత్తుల వెంకటేశ్వరరావు నేతృత్వంలో



మేడల వద్ద గంగానమ్మ,పోతురాజు, ఆదిమహాలక్ష్మిలకు గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న భక్తుడు



మేడల వద్ద అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ

ఏర్పాట్లు చేశారు. కాగా పడమరవీధిలోని గంగానమ్మ ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పసిడి రంగు తొడుగులతో నిర్వహించిన అలంకారాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కుండీ సెంటర్ నుంచి పడమర వీధికి ర్యాలీగా వస్తున్న మేయర్ నూర్జహాన్, ఎమ్మెల్యే చంటి సతీమణి మీనాకుమారి, భక్తులు



లక్ష్యంతోనే.. విజయం సాధ్యం

- నేరాల అదుపునకు కృషి చేస్తా
- యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు
- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు
- యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి
- ఏఎస్పీ సుస్మిత రామనాథన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జంగారెడ్డిగూడెం నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి గూడెం సబ్‌డివిజన్ పరిధిలో నేరాల అదుపునకు కృషి చేస్తానని జంగారెడి గూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా ఈనెల ఐదో తేదీన బాధ్య తలు స్వీకరించిన ఈ యువ ఐపీఎస్ అధికారిణి శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

ఐదుసార్లు విఫలమైనా లక్ష్యాన్ని విడలేదు

మాది తమిళనాడులోని కడలూరు జిల్లా. మా నాన్న గ్రామంలోనే వ్యవసాయం చేస్తుంటారు. అమ్మ విద్యాశాఖలో ఉద్యోగం చేస్తున్నారు. అమ్మే నాకు మా అక్క ఐశ్వర్య రామనాథన్‌కు ఆదర్శం. ఇంజనీరింగ్ అనంతరం యూపీఎస్సీ రాశాను. ఐదుసార్లు ప్రయత్నించాను రాలేదు. అయినా నా లక్ష్యాన్ని విడిచిపెట్టలేదు. ఆరోసారి ప్రయత్నించగా 2023లో 528 ఆలిండియా ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. నా సోదరి ఐశ్వర్య 2020లోనే యూపీఎస్సీలో విజయం సాధించి ప్రస్తుతం తమిళనాడులోని తూతుకూడిలో అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024లో కాకినాడలో ఏఎస్పీగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక గ్రేహౌండ్స్‌లో ఆసాల్ట్ కమాండర్ గా కొంతకాలం పనిచేశాను. జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. నా భర్త విభూ కృష్ణ కూడా ఐపీఎస్ అధికారే. ఆయన 2021 బ్యాచ్. ఆయన ఏపీ క్యాడర్‌లోనే ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో పని చేస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భావి భారత పౌరులుగా ఎదగాల్సిన యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా, సెల్ ఫోన్లతోనే కాలం గడపకుండా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి అహర్నిశలు కృషి చేయాలి. యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు. ఇంట్లో తల్లిదండ్రులతో పాటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిత్యం పిల్లలను పరిశీలిస్తూ ఉండాలి. పిల్లలకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలి. యువత మత్తు పదార్థాల బారిన కళాశాలలు,పాఠశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మహిళలు,యువతులపై అకృత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరమైన పోస్టులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. చదువుకునే యువతులు (మిగతా 8వ పేజీలో)

జూదాలకు అడ్డాగా!

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ యథేచ్ఛగా నిర్వహణ

నూజివీడు నియోజకవర్గం జూదాలకు అడ్డాగా మారుతోంది. ఇది ప్రజలను ఆందోళన కలిగిస్తోంది. ప్రతి మండలంలోను యథేచ్ఛగా పేకాట, కోడిపందేలు జరుగుతున్నాయి. నూజివీడు మండలం సంకొల్లు తుక్కులూరు, పోతురెడ్డిపల్లి ప్రాంతాల్లో తరచుగా, ఆగిరిపల్లి మండలం ఈదర, కనసనపల్లి, తాడేపల్లి, చొప్పరమెట్లతోపాటు వీలును బట్టి మరికొన్ని గ్రామాల్లో జూదాలు జోరుగా సాగుతున్నాయి. ముసునూరు మండలంలో గుర్రాలమ్మ గట్టు ప్రాంతంలో కోడిపందేలు రాత్రి వేళ జరుగుతున్నట్టు ప్రచారంలో ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలని

- నూజివీడు, ఆంధ్రజ్యోతి



మైలవరం పోలీసుల దాడి..

నూజివీడు-మైలవరం సరిహద్దులలోని సుంకొల్లు సమీపంలో జూదస్థావరంపై గురువారం సాయంత్రం మైలవరం పోలీసులు దాడి చేశారు. 45 వాహనాలు స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసు కుని వీరిని మైలవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మంత్రి సారథి హెచ్చరించినా..

'నూజివీడు నియోజకవర్గంలో జూదాలు పెరిగాయని నాకున్న సమాచారం. వాటిని అరికట్టకపోతే చర్యలు తప్పవు' అంటూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పార్థ సారథి పోలీసులను ఇటీవల హెచ్చరించారు. అయినా జూదాలు ఆగలేదు.. పోలీసుల దాడులు జరగలేదు. నియోజకవర్గంలో జూదాలపై మంత్రి ఉక్కుపాదం మోపాలని నియోజకవర్గ ప్రజలు కోరుతు న్నారు.

మ్యాంగో బే తిరిగి ప్రారంభం

ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు గ్రామ పరిధిలో మ్యాంగో బే అనే రిక్రియేషన్ సొసైటీ తిరిగి ప్రారంభ మైంది. మ్యాంగో బే కల్చరల్ అండ్ రిక్రియేషన్ సొసైటీ అనే పేరుతో ఈ రిక్రియేషన్ క్లబ్ 2011లో ప్రారంభ మైంది. అప్పట్లోనే అనేక వివాదాలతో నడిచిన ఈ సొసైటీపై పలు ఆరోపణలు రావడం, పోలీసులు దాడులు జరగడం, నిబంధనలకు విరుద్ధంగా జూదాలు జరుగు



మ్యాంగో బే రిసార్ట్స్‌లోని భవనం

తున్నాయని రుజువు కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు జోక్యంతో 2014లో ఈ క్లబ్ మూతపడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మూతపడే ఉంది. ఇటీవల ఈ సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించి 13 ముక్కల ఆటకి అనుమతి సాధించారు.



సీసీ కెమెరాల పర్యవేక్షణలో నడుపుతాం..

ఈ సొసైటీలో సభ్యులకే ప్రవేశమని, ఈ సొసైటీలో 100 మంది సభ్యులు మాత్రమే ఉన్నారని ఇతరులకు ప్రవేశం లేదని సొసైటీ నిర్వా హకుడు కాట్రగడ్డ అశోక్ విలేకరు లకు తెలిపారు. గత మూడు రోజుల నుంచి ఆగిరిపల్లి ప్రాంతానికి చెందిన పలువురు యువకులు ఈ సొసైటీ గేటు వద్ద నిరసన తెలుపుతున్నారు. ఈసందర్భంగా క్లబ్ నిర్వాహకులను సమాచారం కోరగా అశోక్ విలేకరులతో మాట్లాడుతూ 13 ముక్కల ఆటకు కోర్టు అనుమతించిందని, అది తప్ప మరి ఏ ఇతర జూదాలను ఇక్కడ నిర్వహించడం జరగదన్నారు. 30 సీసీ కెమెరాల పర్యవేక్షణలో లోపల ఆటల నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ కెమెరాలను ఎస్పీ కార్యాలయానికి ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తామన్నారు. సభ్యత్వ రుసుము సభ్యుడి నుంచి ఏడాదికి రూ.500 వసూలు చేస్తున్నామన్నారు. 2014 నుంచి నాటి ప్రభుత్వం సహకారం లేకపోవడంతోపాటు ఇతర కారణాల వల్ల ఈ సొసైటీని నిర్వహించలేక మూత వేశామన్నారు. ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సొసైటీ ఆవరణలో బోటింగ్‌తోపాటు ఇండోర్ అవుట్‌డోర్ థియేటర్లు ఉన్నాయన్నారు. వివాహాలు వంటి కార్యక్రమాలకు స్వల్ప రేట్లతో అద్దెకు ఇస్తామన్నారు. కాగా రాజకీయ బలం ఉన్న కొందరు అక్రమార్కులు ఈ సొసైటీలో వాటాల కోసం యత్నాలు జరుపుతున్నట్టు వినిపిస్తోంది. ఈ యత్నాలు ఫలిస్తే జూదరులకు నిత్యం పండుగే. జిల్లా ఎస్పీ ఈ సొసైటీపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. ఇంతవరకు ఆగిరి పల్లి పోలీస్‌స్టేషన్‌కు కెమెరాలు అనుసంధానం జరగలేదని ఆగిరిపల్లి ఎస్ఐ శుభశేఖర్ విలేకరులకు తెలిపారు.

రూట్ మార్చారు!

నిఘా కళ్లు కప్పి అక్రమంగా ఇసుక రవాణా.. బిల్లుపై అడ్రస్ ఒకటి.. తరలించేది మరోచోటకు

జీలుగుమిల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరి తీర ప్రాంత ఇసుకకు ఆంధ్రాతోపాటు తెలంగాణలోను డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు ఇసుకాసురులకు ఇసుక అక్రమ రవాణా కాసుల వర్షం కురిపిస్తోంది. పోలీస్ నిఘా కళ్లు కప్పి ఇసుకను తరలిస్తున్నారు. ఆ క్రమంలో కొందరు పోలీసులకు చిక్కడం, వాహన తనిఖీల సమయంలో సరైన పత్రాలు చూపకపోవడంతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. కొవ్వూరు సమీపంలోని ఔరంగాబాద్, ప్రక్కిలంక, తాడిపూడి ప్రాంతాల నుంచి ఇసుక లారీల్లో ఖమ్మం, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో పోలీసు తనిఖీలకు చిక్కకుండా వయా చింతలపూడి, సీతానగరం గ్రామాల వరకు ఇసుక తరలిస్తున్నట్టు అధికారులకు పత్రాలు చూపుతున్నారు. ఆపై ఆ ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటించి తెలంగాణకు తరలిస్తున్నారు. జీలుగుమిల్లి, రాచన్నగూడెం, కామయ్యపాలెం గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఆంధ్రా తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అవి నిత్యం పోలీసుల పరిశీలనలో ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇసుక తరలిస్తున్నారు. ప్రధానంగా లక్ష్మీపురం, టి.నరసాపురం మీదుగా తెలంగాణకు ఇసుక లారీలు తరలిపోతు న్నాయి. లక్ష్మీపురం నుంచి వయా చింతలపూడి, సీతా నగరం, యర్రగుంటపల్లి తదితర సరిహద్దు సమీప గ్రామాలకు ఇసుక తరలిస్తున్నట్టు బిల్లుల్లో చూపుతున్నారు. దీంతో పోలీసులు తనిఖీల సమయంలో వాటిపై కేసులు నమోదు చేయడం లేదు. ఈ క్రమంలో శనివారం కొవ్వూరు నుంచి వస్తున్న రెండు ఇసుక లారీలను ఎస్ఐ వి.క్రాంతికుమార్ లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై తనిఖీ చేశారు. తాడువాయి వరకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయి. అయితే తాడువాయి దాటి ఆరు కిలో మీటర్లు లక్ష్మీపురం వరకు ఇసుక లారీలు రావడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

నిరంతరం నిఘా



ఇసుక అక్రమ రవాణా ఆంధ్రా నుంచి తెలంగాణకు వెళ్లేందుకు వీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాటియాకుల గూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం ప్రాంతాల్లో సరిహద్దు చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ఇసుక తరలించే వాహనాలపై అనుమానం వస్తే తనిఖీలు చేస్తున్నాం. వాహనంలో మైనింగ్ పత్రాలు, ఎక్కడ నుంచి ఎక్కడకు వెళుతుందో, సమయం, వయా రూటులో ఉన్న గ్రామాలు వంటి అంశాలపై పరిశీలిస్తున్నాం. ఇటీవల ఎనిమిది కేసుల్లో పది ఇసుక లారీలు సీజ్ చేశాం.

- వి.క్రాంతికుమార్, ఎస్ఐ, జీలుగుమిల్లి

ట్రాక్టర్ సీజ్

కుక్కునూరు : సీతారామనగరం గ్రామ పంచాయతీలోని కిన్నెరసాని వాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణ కు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కిన్నెరసాని వాగు నుంచి తెలంగాణలోని బూర్గంపాడుకు ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. పోలీస్, రెవెన్యూ సిబ్బంది దాడులు జరిపి ట్రాక్టర్‌ను, ట్రైలర్‌ను పట్టుకుని కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఆంధ్రా సరిహద్దు నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొంథా తుఫాన్ పంట నష్టాల పరిశీలనకు

రేపు జిల్లాకు కేంద్ర బృందం రాక

ఏలూరుసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాలను అంచనా వేయడానికి కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పౌసమి బసు నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం (ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం) తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం పర్యటిస్తుందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లాలో ఈ నెల 10వ తేదీ సోమవారం ఈ బృందం పర్యటిస్తుంది. దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో నాలుగు గ్రామాలను ప్రాథమికంగా ఎంపికచేశారు. ఆయా గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించి పంట నష్టాలను అంచనా వేస్తుంది. రాష్ట్రంలోని తుఫాన్ ప్రభా విత ప్రాంతాల్లో ఈ బృందం రెండు టీమ్‌లుగా పర్యటిస్తుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ ప్రఖర్‌జైన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లాలో టీం-2 బృందం పర్యటిస్తుందని తెలిపారు. ఈ బృందంలో డా. కె పొన్నుస్వామి, మహేశ్‌కుమార్, శ్రీనివాసు బైరి, శశాంక్ శేఖర్ రాయ్, మనోజ్‌కుమార్ మీనా, ఆర్తి సింగ్, సాయి భగీరథ్‌లు సభ్యులుగా ఉన్నారు.

ఇంటిపన్నుల మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం

- అమరవరం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- మరో నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ

ఏలూరుసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ఇంటిపన్నుల వసూళ్లలో పారదర్శకంగా వ్యవహరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా స్వర్ణపంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధానం ప్రకారం పంచాయతీల పరిధిలోని పంచాయతీ పన్నులకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియలో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు గుర్తించారు. జిల్లాలో 547 పంచాయతీలుండగా స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ పరిధిలోని ఇళ్లకు సంబంధించి పన్నుల వసూళ్లకు ఫోన్ నెంబర్‌తో మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. ప్రతి ఇంటికి పన్నులు చెల్లించిన వెంటనే సంబంధిత యజమాని ఫోన్ నెంబర్‌కు మెస్సేజ్ వస్తుంది. ఒకవేళ పన్ను చెల్లించక పోయినా హెచ్చరిక మెస్సేజ్ వెళ్తుంది. కీలకమైన ఈ ఫోన్ నెంబర్ల మ్యాపింగ్‌లో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించారని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ విషయంలో ఆయా పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కునూరు మండలంలోని అమరవరం, పెదవేగి మండలంలోని కూచిం పూడి, ముసునూరు మండలంలోని ముసునూరు, టి.నరసాపురం మండలంలోని టి.నరసాపురం, చింతలపూడి మండలంలోని ప్రగడవరం పంచాయతీల్లో అధికంగా ఇళ్లకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ అయినట్టు గుర్తించారు. ఈ విధంగా మ్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించి కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయగా, మిగిలిన నలుగురు పంచాయతీల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీపీవో కె.అనురాధ తెలిపారు.

ఏలూరులో రైల్వేగేట్ల మూసివేత

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వట్లూరు - ఏలూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నెంబరు 347 (486/26-28) కిమీ వద్ద అత్యవసర మరమ్మతుల కారణంగా ఈ నెల 10వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఏలూరు - వట్లూరు స్టేషన్ల మధ్యలోని ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ వరకు ఉన్న రైల్వే గేట్లను మూసివేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాల్సిందిగా ఆయన కోరారు.

నిబంధనలు బేఖాతర్!

- మినీ ఫుడ్‌కోర్టులుగా ట్రిపుల్ ఐటీ ఫ్యాన్సీ దుకాణాలు
- బయటి ఆహార పదార్థాలతో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

(నూజివీడు టౌన్, ఆంధ్రజ్యోతి)

గత అనుభవాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్య వైఖరితో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆరోగ్యం మరోసారి ప్రమాదంలో పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని వసతి గృహాల్లోని ఫ్యాన్సీ దుకాణాల నిర్వాహంకులు ఫ్యాన్సీ వస్తువుల స్థానంలో ఆహార విక్రయాలు చేపట్టడమే అందుకు కారణం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది మెస్‌లలో ఆహార నాణ్యత సక్రమంగా లేదని ఆరోపణలు కారణంగా బయట ఆహార ఉత్పత్తులను క్యాంపస్‌లోకి అనుమతించడంతో క్యాంపస్‌లోని విద్యార్థులు అధిక సంఖ్యలో అస్వస్థతకు గురైన విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి అధికారుల కమిటీ బయట ఆహార ఉత్పత్తులను లోపలకు తీసుకురావడానికి నిషేధించడంతో పాటు అప్పటి మెస్‌లను రద్దు చేసి ప్రత్యేకంగా మెస్‌ల నిర్వహణ రెండు క్యాటర్లకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే తిరిగి అవే పరి స్థితులు నెలకొనే అవకాశం ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి.

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌తో పాటు శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు చెందిన మొత్తం 8,879 మంది విద్యార్థులు ఇక్కడే వసతి సౌకర్యాలను పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారు. బాలికలకు సంబంధించి మూడు వసతి గృహాలు, మరో రెండు బాలుర వసతి గృహాలతో కలిపి మొత్తం విద్యార్థులకు అక్టోబరు నుంచి మెస్‌ల నిర్వహణలో సమూల మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చింది. మెస్‌లతో పాటు విద్యార్థులకు కావాల్సిన ఆహార పదార్థాలను అందించేందుకు (విద్యార్థులు వారి ఇష్టపూర్వకంగా ఆహార పదార్థాలను కొనుగోలు చేసే విధంగా) క్యాంపస్‌లోనే ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేసి దాని నిర్వహణను మెప్మాకు అప్పగించారు. వీటితో పాటు క్యాంపస్‌లో విద్యార్థుల సౌకర్యం కోసం ఫ్యాన్సీ దుకాణాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్యాన్సీ దుకాణాలు నిర్వహణను మెప్మా ఇద్దరు వ్యక్తులకు అప్పగించగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాన్సీ దుకాణాలు నిర్వహణను మరొకరికి అప్పగించగా ఫ్యాన్సీ దుకాణాలు చివరకు మినీ ఫుడ్‌కోర్టులుగా మారాయి. ఫుడ్‌కోర్టుకు సంబంధించి ఆహార పదార్థాల తయారీ క్యాంపస్‌లోనే చేస్తుండగా ఫ్యాన్సీ దుకాణాలను క్యాంటీన్ల పేరుతో మార్పు చేసిన నిర్వాహకుడు ఆహార పదార్థాలను బయట నుంచి తీసుకొస్తున్నారు. పిజ్జా సమోసా, శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు, తదితర పదార్థాలు విక్రయాలను చేపట్టాడు.దీనిపై చర్యలు చేపట్టాల్సిన ట్రిపుల్ ఐటీ అధికార బృందం (మిగతా 8వ పేజీలో)



ఫ్యాన్సీ దుకాణంలో విక్రయాలకు ఉంచిన ఆహార పదార్థాలు

జ్వరాల బారిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో పలువురు విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. వారం రోజులుగా ట్రిపుల్ ఐటీలో ప్రతీరోజు 100 మందికి పైగా జ్వరం, గొంతు నొప్పి బారిన పడినట్టు సమాచారం. క్యాంపస్‌లో ఉన్న హెల్త్ క్లినిక్‌లో ప్రతీ రోజు ఓపీ 200 నమోదు అవుతుండగా వాటిలో సగం కేసులు జ్వరాలు నమోదవుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

ఏజెన్సీలో రోడ్ల నిర్మాణాలకు

రూ.7.86 కోట్లు మంజూరు

బుట్టాయగూడెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7.86 కోట్లు మంజూరయ్యాయి. నిధులు విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం కలెక్టర్ నుంచి పంచాయతీరాజ్ శాఖకు అందాయి. ఏజెన్సీలో పూర్తిగా పాడైపోయిన, దెబ్బతిన్న రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా నిర్మాణాలు చేపడుతూ వస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పర్యటనల సందర్భంగా గిరిజనులు రోడ్ల విషయాన్ని వారి దృష్టికి తేగా నిధులు మంజూరుకు కృషి చేశారు. దొరమామిడి-అలివేరు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.నాలుగు కోట్లు, పందిరి మామిడిగూడెం-గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డుకు రూ.మూడు కోట్లు, వేపులపాడు-రామచంద్రపురం గ్రామాల మధ్య నూతన రోడ్డు నిర్మాణానికి రూ.86 లక్షలు విడుదల అయ్యాయి. త్వరలోనే పనులు చేపట్టనున్నట్టు పీఆర్ ఇన్‌చార్జి ఏఈ ప్రకాశ్ తెలిపారు.

నియంత్రణ ఆపరేషన్లు ఎక్కడ ?


ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో కుక్కల బెడద ఎక్కువగానే ఉంది. పోలీస్‌స్టేషన్‌లో అయితే కుక్కలకు ఆవాసాలుగా ఉన్నాయి. ఏలూరు నగరంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశామని అధికారులు లెక్కలు చూపించారు. ప్రస్తుతం ఏ వీధిలో చూసినా ఐదారు పిల్లలకు పాలు ఇచ్చుకుంటూ కనిపిస్తున్నాయి. వీధి కుక్కలకు సరైన ఆహారం లేకపోవడంతో ఎవరైనా ఆహారపదార్థాలు చేతితో పట్టుకుని వెళుతుంటే వాటికోసం వారిపై దాడి చేసి కరుస్తున్నాయి. చిన్న పిల్లల చేతిలో ఏదైనా ఆహార పదార్థం ఉంటే ఇదే విధంగా దాడులు చేయడంతో బాధితులు ఎంతోమంది ఆసుపత్రి పాలవుతున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రోజుకు కుక్కకాటు బాధితులు 40 నుంచి 60 మంది వరకూ వస్తున్నారంటే కుక్కల దాడుల తీవ్రత అర్థం చేసుకోవచ్చు. కుక్కకాటు బాధితులకు ఎఆర్‌వీ మందును మొదటి రోజు మొదటి డోసు, మూడో రోజు రెండో డోసు, ఏడవ రోజు మూడో డోసు, 14వ రోజు నాల్గవ డోసు, 28వ రోజు ఐదవ డోసు వంతున ఇంజక్షన్లు చేస్తారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఇంజక్షన్లు అందుబాటులోనే ఉన్నాయి. 24 గంటల్లో కుక్కకాటు బాధితులకు అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు.

వీధి కుక్కల నియంత్రణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది.కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా మారాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రజా క్రీడా సముదాయాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి వీధి కుక్కలు చొరబడకుండా పకడ్బందీగా ఫెన్సింగ్ లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కుక్కల సంచారం, కుక్కకాటు ప్రమాదాలపై ఆంధ్రజ్యోతి పరిశీలనాత్మక కథనం..


పైడిపర్రులో చికెన్ షాపు వద్ద గుమిగూడిన కుక్కలు

భౌ..భౌ
బిక్కు..బిక్కు!

ఆంధ్రజ్యోతి పరిశీలన

రెచ్చిపోతున్న వీధి కుక్కలు
ఎక్కడి పడితే అక్కడ గుంపులు
వాహనాలను వెంబడించి దాడులు
బయటకు వెళ్లాలంటే భయం..
నియంత్రణ చర్యలు లేక పెరిగిపోతున్న సంతతి

తణుకు రూరల్/ తణుకు / ఇరగవరం/పాలకొల్లు అర్బన్ /ఆకివీడు / గణపవరం /పెదపాడు / ముదినేపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి.మనుషులపై పడి దాడి చేసి గాయపర్చడం సాధారణమై పోయింది. తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, పైడిపర్రులలోని ప్రభుత్వ స్థలాలు, భవనాలు, ప్రైవేట్ స్థలాల్లో కుక్కల నివాసాలు వుంటున్నాయి. పగలు పట్టణ శివార్లు, గ్రామాల్లోని మాంసం దుకాణాల వద్ద గుంపులు, గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేసి గాయ పరుస్తున్నాయి.

- తణుకు పట్టణంలోని పలు వార్డులో వీది కుక్కలు సంచారం చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రపతి రోడ్డు, బ్యాంకు కాలనీ, సజ్జాపురం, ఉండ్రాజ వరం రోడ్డు, వంటి పలు ప్రాంతాల్లో కుక్కలు తాకిడి చాలా ఎక్కువగా ఉంది.
- ఇరగవరం మండల గ్రామాల్లో కుక్కల బెడదతో వీధుల్లో తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమ యాల్లో డ్యూటీకి వెళ్ళే కార్మికులు కర్రను వెంట తీసుకుని వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. రేలంగి, ఇరగవరం, రాపాక గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల రేలంగి గ్రామానికి చెందిన చిన్నారి అంగన్‌వాడీ నుంచి ఇంటికి వెళుతుండగా కుక్కలు దాడి చేశాయి. చుక్కా వారి తోటకు చెందిన వృద్ధుడు నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రెండు కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి.
- పాలకొల్లు పట్టణంలో కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రహదారులపై చిన్నారులు సంచరిం చడానికి భయపడే విధంగా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి.
- ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో వీధుల్లో వెళ్ళడానికి ప్రజానీకం భయపడుతున్నారు. పట్టణంలోని ఇరవై వార్డుల్లో వందలకొద్దీ కుక్కలున్నాయి. ప్రజలు, విద్యార్థులు హడలిపోతున్నారు.
- గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు బెంబే లెత్తుతున్నారు. గణపవరం, పిప్పర, మొయ్యేరు తదితర గ్రామాల్లో వీధికుక్కలు పేట్రేగిపోతున్నాయి. చిన్నా, పెద్దతేడా లేకుండా రాత్రి, పగలు, కూడా ప్రయా ణించే వాహనాల వెంటపడి మరీ బెంబెలె త్తిస్తున్నాయి. ఈఓపీఆర్‌డీ పల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయాలని కుక్కలను కూడా పట్టించే వారిని రప్పించి సమస్యకు పరిష్కారం చేస్తామన్నారు.
- పెదపాడు మండల పరిధిలోని చేపల చెరువుల వద్ద చికెన్ వేస్ట్‌ను పెద్దఎత్తున వినియోగిస్తుండగా, వాటిని తినేందుకు చేపల చెరువులను, పరిసర గ్రామాలను వీధికుక్కలు ఆవాసాలుగా మార్చుకున్నాయి. రాత్రిళ్లు చెరువుల వద్ద ఉంటూ పగలు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. పెదపాడు ఎంపీడీవో కార్యాలయం, ఆసుపత్రి, తహసీల్దారు, పోలీస్‌స్టేషన్ ఇలా ఒకటేమిటి ప్రతి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోనూ వీధికుక్కలు పెద్దఎత్తున దర్శనమిస్తూనే వున్నాయి. గడచిన పదినెలల కాలంలో సుమారు 74 కుక్కకాటు కేసులు నమోదు కాగా, వాటికి చిక్సిత అందించినట్టుగా పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది చెబుతున్నారు.
- ముదినేపల్లి మండలంలో కుక్కల బెడద గత కొంతకాలంగా మరింత ఎక్కువైంది. ముదినేపల్లి జాతీయ రహదారి వెంబడి, బస్టాండ్ ఆవరణ, వివిధ ప్రధాన రహదారుల్లో, మాంసం దుకాణాల వల్ల కుక్కలు గుంపులు, గుంపులుగా ఏర్పడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులను వెంటాడుతున్నాయి. గతంలో ఒక బాలికను వెంబడించి కుక్కలు కరిచిజూ సంఘటన కూడా జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి బయట రోడ్ల వెంబడి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ఆసుపత్రికి వెళ్ళే రోగులు భయపడుతున్నారు.

వాహనదారులను వెంబడించి దాడులు



జీలుగుమిల్లి, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి, రామన్నపాలెం, తాటియాకులగూడెం, దర్భగూడెంలో ఏ వీధిలో చూసినా కుక్కల గుంపులు పెరిగిపోయాయి. కొంతకాలంగా ఆయా గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో స్థానికులు కుక్కకాటుకు గురడ అనంతరం ఆస్పత్రి పాలవటం జరుగుతోంది. జీలుగుమిల్లి గ్రామ శివారు రామన్న పాలెంలో ఇటీవల రెండు నెలల వ్యవధిలో సుమారు 12 మంది కుక్కకాటుకు గురయ్యారు. తాటియాకుల గూడెంకు చెందిన ఒక వృద్ధురాలు మృతి చెందింది. రెండు రోజుల క్రితం రామన్నపాలెంలో గెడ్డం సత్యం, గారపాటి శ్రీను అనే వ్యక్తులు కుక్కకాటుకు గురయ్యారు. జీలుగు మిల్లి ఎన్‌హెచ్ 516-డి జాతీయ రహదారిపై, దర్భగూడెంలో కుక్కలు వాహన చోదకుల్ని సైతం వెంబడించి కరుస్తున్నాయి. పలువురు కుక్కలు రోడ్డుపైకి రావటంతో బైక్ ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఎంపీడీవో నిఖిల్‌మధుశరణ్, పశు వైద్యసహాయ సంచాలకులు పి.సాయిబుచ్చారావు ఆధ్వర్యంలో కుక్కల్ని బంధించి వాటికి వ్యాక్సిన్ వేసి దూర ప్రాంతాల్లో వదిలారు. మరో వైపు వ్యాన్‌లో సమీప గ్రామాల నుంచి తీసుకొచ్చిన కుక్కల్ని సైతం రహదారుల సమీపంలో వదిలేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నరసాపురం రైల్వేస్టేషన్‌లో..



నరసాపురం (ఆంధ్రజ్యోతి): నరసాపురం రైల్వేస్టేషన్‌లో శునకాల భయం నెలకొంది. మూడు ప్లాట్‌ఫారాలు, స్టేషన్ ప్రాంగణాలలో కుక్కలు రేయింబవళ్లు విచ్చల విడిగా సంచ రిస్తున్నాయి. ఒంటరిగా ప్లాట్‌ఫారాలపై వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.ప్రయాణికులు తెచ్చుకునే ఆహారం మిగిలిపోతే వాటిని ప్లాట్‌ఫారాలపై పడేస్తున్నారు. శునకాలకు ఆహారం దొరుకుతుండటంతో స్టేషన్‌కు పరిసర ప్రాంతాల్లోని కుక్కలన్నీ ఇక్కడికి చేరుతున్నాయన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.



ద్వారకాతిరుమలలో భక్తులు హడల్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి.బస్టాండ్‌లో తిరుగుతూ ప్రయాణికులను, భక్తులను హడలెత్తిస్తున్నాయి. ఎవరూ పట్టించుకోని కారణంగా కొన్ని బస్టాండ్ లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. శ్రీవారి దేవస్థానం పరిసరాల్లోనూ తిరుగుతున్నాయి. దేవస్థానం అధికారులు ఒక్కోసారి వాటిని పట్టించి అడవుల్లో వదిలిపెట్టిస్తున్నారు. గతేడాది మార్చినెలలో శ్రీవారి దేవస్థానం వకుళమాత అన్నప్రసాద భవనం వద్దకు దర్శనానంతరం కుటుంబసమేతంగా వెళ్లిన ఉండి మండలం పెదపుల్లేరుకు చెందిన శ్రీనివాస వర్మపై ఓ శునకం విచక్షణారహితంగా దాడికి పాల్పడింది. వేలును పట్టుకుని పీకివేయడంతో అది ఊడి కిందపడింది. పరిసరాల్లో ఉన్న భక్తులు పరుగులు తీశారు. గాయపడిన భక్తుని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు.


భక్తుడి వేలు కొరి కేసిన దృశ్యం(ఫైల్)

బాలుడిపై పిచ్చికుక్క దాడి



ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్ల గూడెంలో రెండేళ్ల బాలుడిపై ఓ పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామానికి చెందిన పి.జాస్సీరాణి తన కుమారుడు యువ రాజును ఎత్తుకుని రోడ్డుపైన నిలబడి వేరేవారితో మాట్లాడుతోంది. కాసేపు అయిన తర్వాత బాలుడిని కిందకు దింపింది. అకస్మాత్తుగా వచ్చిన పిచ్చికుక్క బాలుడిపై దాడి చేసింది. వెంటనే తల్లి స్పందించి కుక్కను తరిమి కొట్టింది. అప్పటికే కుక్క బాలుడు బుగ్గలను, ఇతర అవయవాలను గాయపరిచింది. బాలుడిని చికిత్స నిమిత్తం భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పిక్కలు పీకుతున్న గ్రామసింహాలు

లింగపాలెం (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో ఉన్న గ్రామసింహాలు ప్రధాన రహదారులు, వీదుల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, ఇలా కనిపించిన వారినందరిపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరుస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ద్విచక్రవాహనాల వెంట పడుతుండంతో వాహనాలపై నుంచి కిందపడి కాళ్ళ, చేతులు విరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. లింగపాలెం మండలంలో లింగపాలెం, ధర్మాజీగూడెం, కే.గోకవరం పీహెచ్‌సీల పరిధిలో రెండు నెలల వ్యవధిలో 223 మంది కుక్కకాటుకు గురయ్యారంటేనే వాటి తీవ్రత ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. గ్రామాల్లో మేకలు, గొర్రెలు, పశువులపై దాడి చేసి చంపి తింటున్నాయని ఆర్థికంగా నష్టపోతున్నామని పశువుల కాపరులు చెపుతున్నారు.

కుక్క కరిస్తే నిర్లక్ష్యం వద్దు



కుక్కలు కరిచిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. రేబీస్ లక్షణాలు ఉన్న కుక్కలు కరిచినప్పుడు ఆ వైరస్ ప్రభావం నాడీవ్యవస్థపై పడుతుంది. ముఖ్యంగా ముఖం, వెన్నెముక్క వంటి భాగాలలో కరిస్తే రేబిస్ వైరస్ నాడీవ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. గాయాన్ని డెటాల్, స్పిరిట్, సబ్బుతో శుభ్రంగా కడగాలి. కుక్క కరిచిన భాగంపై నీళ్ల దారగా పోస్తూ రక్తం బయటకు పోయేలా నొక్కి శుభ్రం చెయ్యాలి. యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను కుక్క కరచిన రోజునుంచే దశల వారీగా డాక్టర్ చెప్పేంత వరకు తీసుకోవాలి.

-డాక్టర్ ప్రియాంక, ధర్మాజీగూడెం పీహెచ్‌సీ, లింగపాలెం మండలం


శ్రీవారి ఉచిత ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

చినవెంకన్న క్షేత్రానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, రెండవ శనివారం అందులోనూ వివాహాలు జరుగుతుండటంతో చినవెంకన్న దివ్యక్షేత్రం భక్తజనులతో పోటెత్తింది..గోవిందా... గోవిందా అంటూ గోవిందుని నామ స్మరణలతో ఆలయ పరిసరాలు మారు మోగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తజనులు చినవెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుండే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 25 వేల మంది వరకూ స్వామివారిని దర్శించినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం వారంతా ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు.


సారెతో ఆలయానికి వస్తున్న మావుళ్లమ్మ మాలధారులు

మావుళ్లమ్మకు వెయ్యి కేజీల సారె

భీమవరంటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :మావుళ్ళమ్మ మాలధారులు శనివారం అమ్మవారికి వెయ్యికేజీల స్వీట్లు, భారీ లడ్డుతో సారె సమర్పించారు. ముందుగా మావుళ్ళమ్మ అమ్మవారి పూరిగుడి దగ్గర నుంచి సారెతో అమ్మవారి నామ స్మరణ, భాజా భజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ సంప్రో క్షణ పూజలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. తదుపరి మహా హారతిని అందించారు. అమ్మవారి సారెను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు.

మద్ది ఆంజనేయుడికి పంచామృతాభిషేకాలు



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతికరమైన తమలపాకు లతో అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రదక్షణలు, తలనీలాలు, అన్న ప్రాసన, వాహన పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామివారికి అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలను నిర్వహించారు.

నూకాలమ్మ ఆలయంలో లక్ష దీపార్చన

జంగారెడ్డిగూడెం,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :కార్తీక మాసం సందర్భంగా జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి లక్ష దీపార్చన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది.మహిళలు భక్తి శ్రద్ధలతో దీపారాధన చేశారు. ఆధ్యాత్మిక వేత్త ఈమని శశికుమార్ కార్తీకమాస విశిష్టత, కార్తీక దీపం ప్రత్యేకతను వివరించారు. అమ్మవారి రూపం, శివామృత వలయం, ఓంకారం, స్వస్తిక్ వంటి ఆకారాలలో దీపాలు వెలిగించడంతో ఆలయం ప్రాంగణం దీప కాంతులతో శోభాయమానమైంది.




స్వామిదర్శనం కోసం కాదు.. సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు..


దర్శనానంతరం సెల్‌ఫోన్లు తీసుకునేందుకు ..క్యూ

స్వామీ..సెల్‌ఫోన్ కష్టాలు తప్పించవయ్యా !

శ్రీవారి కౌంటర్ వద్ద చాంతాడులా క్యూలైన్లు..

దర్శనం కంటే ఎక్కువ సమయమా అంటూ భక్తుల ఆవేదన

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్షేత్రానికి వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనానికి పట్టే సమయం కంటే సెల్‌ఫోన్‌ను భద్రపరిచే సమయం ఎక్కువవుతోంది. దీంతో ఆలయానికి సెల్‌ఫోన్‌తో ఎందుకు వచ్చామా అని భక్తులు మధనపడుతున్నారు. ఈ సెల్‌ఫోన్ దాయడం కంటే శ్రీవారి దర్శనమే తేలికగా ఉందని భక్తులు బహిరంగంగా మాట్లాడుకు న్నారు. ఈ సెల్‌ఫోన్ కష్టాలు ఈ శని వారం ఆలయంలో మరింతగా పెరిగాయి. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి సెల్‌ఫోన్లును భద్రపరిచే కేంద్రం వద్ద భక్తులు పడిగాపులు పడ్డారు. కిందటి శనివారం కంటే ఎక్కువగా భక్తులు ఆలయానికి వచ్చారు. వేరే కౌంటర్‌ను ఏర్పాటు చేయడం, లేదా తగు సిబ్బందిని నియమించడం వంటి చర్యలు తీసుకోకపోవడంతో చాంతాడులా భక్తులు పేరుకుపోయారు. ఇటు దర్శనానికి గంటల తరబడి నిలబడి, అటు సెల్‌ఫోన్లు వంటివి దాచేందుకు గంటల తరబడి సమయం వెచ్చిం చడంపై భక్తులు ఆవేదన చెందారు. ఆలయానికి వచ్చే భక్తులు స్వామి దర్శనానికి సెల్‌ఫోన్లతో వెళ్లడం నిషేదం. భక్తులను సెక్యూ రిటీ తనిఖీచేసిన తర్వాతే ఆలయంలోకి అనుమతిస్తారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపర్చాల్సి ఉంది. దేవస్థానం ఒక్కో భక్తుని నుంచి రూ.5 రుసుము వసూలు చేస్తుంది. అయితే నిర్వహణలోపం కారణంగా భక్తులు ఎక్కువగా వచ్చే శని, ఆది వారాల్లో అక్కడ జనాలు ఎక్కువగా పేరుకుపోతు న్నారు. స్వామివారిని దర్శించడం కంటే ఈ సెల్‌ఫోన్లను భద్రపరచడానికి గంటల తరబడి క్యూలో ఉండటం,తీసుకునేందుకు క్యూలో ఉండటం భారంగా మారింది.


చిన్నారుల ఆటపాటలను పరిశీలిస్తున్న ఐసీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

నిర్ధేశించిన విధంగా చిన్నారులకు విద్యాబోధన ఉండాలి

ఐసీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

పెదవేగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య విషయమై అందిస్తున్న నిత్య ప్రణాళిక ఆధారంగా చిన్నారుల విద్యా బోధన ఉండాలని ఐసీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. పెదవేగిలోని 123 అంగన్‌వాడీ కేంద్రాన్ని శ్రీనివాసరావు పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పూర్వప్రాథమిక విద్యా విషయాలను ఆయన పరిశీలించారు. తల్లులకు అందుతున్న సేవలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి మహిళా శిశు సంక్షేమశాఖ ఏరోజుకారోజు నిర్వహించే ప్రణాళికను పంపిస్తుందని, దానికనుగుణంగా చిన్నారులకు విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అలాగే బోధనోపకరణాలతో కూడిన విద్యతో చిన్నారులు మరింత వేగంగా అవగాహన పెంచుకుంటారని, ఆ దిశగా విద్యా బోధన అందించడానికి ప్రతి కార్యకర్త శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎం.కృష్ణవేణి, తల్లులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపుపై కేంద్ర మంత్రితో మాట్లాడతా

ఏపీఎస్టీఏ నాయకులకు ఎంపీ పాకా సత్యనారాయణ హామీ


రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణతో చర్చిస్తున్న స్టీవెన్

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో సర్వీసులో వున్న ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ పరీక్షనుంచి మినహాయింపునిచ్చేలా కేంద్రప్రభుత్వం వద్ద ప్రయత్నం చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను శనివారం కలుసుకుని అభ్యర్థించినట్టు ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ తెలిపారు. దేశంలో 2010 సంవత్సరానికి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరూ టెట్ రాయాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునివ్వడంతో టీచర్లు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని, అప్పట్లో నియమితులైనవారంతా డీఎస్సీ ద్వారా ఎంపికైనవారేనని, 20 నుంచి 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నా టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం సమంజసం కాదన్నారు. తమ అభ్యర్థనకు స్పందించిన ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపుపై చర్చించేందుకు ఇప్పటికే కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ తీసుకున్నానని, తప్పనిసరిగా మినహాయింపువచ్చేలా తనవంతు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

గిరిజనుల ధర్నాను విజయవంతం చేయాలి

ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య

వేలేరుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 10న విజయవాడలోని ఎస్టీ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం నాడు ఆ సంఘం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్న గిరిజనుల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులేదన్నారు. గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు రూపొందించిన చట్టాలు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 6.6 శాతం నిధులు ఖర్చు చేయాలని 1980లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గడిచిన 39 సంవత్సరాలుగా 50వేల కోట్ల రూపాయలు ఎస్సీఎస్టీ కులాలను అభివృద్ధి చెయ్యల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారిమళ్లించినట్లు కాగ్ నివేదిక బయటపెట్టిందన్నారు. గిరిజనులు అడవుల్లో సేకరించిన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర దొరకటంలేదని దళారులు, అధికారులు, దోపిడీదారులుగా మారి గిరిజనుల సంపదను కారుచౌకగా దోచుకుంటున్నారని విమర్శించారు. గిరిజన హక్కుల సాధన కోసం నిర్వహించనున్న ధర్నాలో ఇతర గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము, గిరిజన సంఘం మండల నాయకులు పిట్టా వీరయ్య, మడివి కామయ్య, బంధం అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్వాలిఫై మాచ్ ఆడుతున్న క్రీడాకారులు

పాలకొల్లులో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

క్వాలిఫయింగ్ పోటీలకు 82 మంది హాజరు

పాలకొల్లు టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సిహెచ్ బుద్ధావతారంరాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమైనట్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీఎస్‌వీఆర్‌ఎస్‌ఎన్ రాజు (బూన్‌రాజు) విలేకర్లకు తెలిపారు. మ్యాచ్‌లకు 82 మంది హాజరయ్యారని, వారిలో 45, 55, 65, 70 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. నరసాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు కోర్టులు, పాలకొల్లు టౌన్ హాల్లో ఒక కోర్టును, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఒక కోర్టులో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి మెయిన్‌కి ఎంపికైన క్రీడాకారులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 230 మంది క్రీడాకారులు పోటీలకు వచ్చారని బూన్‌రాజు తెలిపారు. క్రీడాకారులకు అల్పాహారంతో పాటు భోజన సౌకర్యం, వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలతో పాటు నాలుగు లక్షల రూపాయల ప్రైజ్‌మనీ అందజేస్తున్నట్టు బూన్‌రాజు తెలిపారు.

ఖోఖో రాష్ట్ర జట్టుకి రాఘవ ఎంపిక



ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఖోఖో స్టేట్ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు ఎంపికలు శనివారం గోపన్నపాలెంలో జరిగాయి. ఈ నెలలో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టుకి ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు పదోతరగతి విద్యార్థి పెద్దిరెడ్డి కుశల్ రాఘవ ఎంపికయ్యాడని స్కూలు హెచ్‌ఎం పి.కుటుంబరావు తెలిపారు. రాఘవను స్కూలు సెకండ్ అసి స్టెంట్ హెచ్‌ఎం షద్రక్, వ్యాయామోపాధ్యాయులు లీలాకుమారి, సునీత అభినందించారు.



వృత్తి విద్యా నైపుణ్య పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు గణపవరం విద్యార్థినులు

గణపవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా సమగ్ర శిక్షణ, వృత్తి విద్యానైపుణ్య పోటీల్లో గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థినిలను విద్యాశాఖాధికారి శ్యామ్‌సుందర్, బాలశిశు అభివృద్ధి అధికారి దీవెనమ్మ, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ సంజీవ్‌కుమార్, హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రథమస్థానంలో చెరుకువాడ విద్యార్థులు



ఉండి, నవబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో వృత్తి నైపుణ్యం విభాగం ఎలాక్ట్రానిక్ విభాగంలో జరిగిన పోటీల్లో చెరుకువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. శనివారం భీమవరంలో జరిగిన వృత్తి నైపుణ్యం విభాగం క్రీడల్లో జిల్లాలో 35 హైస్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని అక్బరు చక్రవర్తి తెలిపారు. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ నిశాంత్ కుమార్, విద్యార్థులు దిలీప్, జోసెఫ్‌రాజు, కేశవ ఉదయ్, స్వాత్వికలను అభినందించారు.

నేడు విజయవాడలో డీపీఆర్టీయూ పురస్కారాలు అందజేత

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ/ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆదివారం డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో పిన్నమనేని కోటేశ్వరరావు ప్రతిభా పురస్కారాలను అంద జేస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, విద్యాశాఖాధికారులు హాజరవుతారని వివరించారు.



నార్వే అధికారులతో ఎంపీ మహేశ్

నార్వే పారిశ్రామికవేత్తలు భారత్‌కు రావాలి

ఏలూరుటూటౌన్,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నార్వే పర్యటనలో ఉన్న ఎంపీ మహేశ్‌కుమార్ బృందం శుక్రవారం పలు సమావే శాల్లో బిజీబిజీగా గడిపారు. ట్రోంసో నగరంలో వ్యాపారవేత్తలు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భారత్, నార్వే దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు సంబంధించి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్వే పారిశ్రామిక వేత్తలను భారత్‌ను సందర్శించాలని ఆహ్వానించామన్నారు. అనంతరం ట్రెస్ట్ వానెట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ అమలవుతున్న విద్యావిధానంపై ప్రిన్సిపాల్, డైరెక్టర్, భారత ఎంపీలకు వివరించారు. నాలెడ్జ్ ప్రోగ్రాంలో భాగంగా నార్వే వెళ్లిన ఎంపీల బృందం పర్యటన శనివారంతో ముగిసింది.

కొత్త రైళ్ల కూత వినేదెప్పుడు ?



విజయవాడ-నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ పూర్తయితే కొత్త రైళ్లు వస్తాయని ఆశించిన ప్రయాణికులకు నాలుగేళ్లుగా నిరాశే మిగిలింది. హుబ్లీకి వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ మినహా ఒక్క కొత్త రైలు కూడా పట్టాలెక్కలేదు. నాలుగేళ్లుగా రైల్వే స్పెషల్ రైళ్ళతో బుజ్జగిస్తూ వస్తోంది. గతంలో ప్రకటించిన రైళ్లను కూడా పట్టాలెక్కించడం లేదు. దీంతో జిల్లా వాసులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే విజయవాడ వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- డబ్లింగ్ లైన్ పూర్తయి నాలుగేళ్లు
- వచ్చింది ఒక్క అమరావతి ఎక్స్‌ప్రెస్సే
- స్పెషల్ రైళ్లతో బుజ్జగింపు
- కొత్తగా 5 రైళ్లు నడపాలని కేంద్ర మంత్రి వర్మ వినతి

(నరసాపురం-ఆంధ్రజ్యోతి)

బ్రిటిష్ హయాంలో నరసాపురం-విజయవాడ రైల్వేలైన్ వేయగా 2020 వరకు సింగల్ లైన్ మాత్రమే. అడుగడుగునా క్రాసింగ్‌లు, 130 కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే అప్పట్లో నాలుగు నుంచి ఐదు గంటలు పట్టేది. ఈ కారణంగా కొత్త రైళ్లను వేసే అవకాశం లేకుండా పోయింది. డబ్లింగ్ లైన్ పూర్తికాగానే నరసా పురం నుంచి దూర ప్రాంతాలకు రైళ్లు నడుపుతామని రైల్వే ఉన్నతాధి కారులు అనేక ప్రకటనలు చేశారు. వాటిలో వార ణాశి, బెంగళూరు ఎక్స్‌ప్రెస్, పగటి పూట హైద్రాబాద్ వంటి ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. అయితే డబ్లింగ్ పనులు పూర్తయి నాలు గేళ్లు గడిచింది. ఇప్పటి వర కు విజయ వాడ నుంచి నడుస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడి గించారు. ఇది మినహా ఒక్క కొత్త రైలుకు కూడా పచ్చజెండా ఊపలేదు.

నాలుగేళ్లుగా అన్నీ స్పెషల్ రైళ్లే...

ప్రస్తుతం నరసాపురం నుంచి గత నాలుగేళ్లగా ప్రతి ఆదివారం చర్లపల్లికి ప్రత్యేక రైలు నడుపుతున్నారు. గతంలో ఈ రైలు సికింద్రాబాద్‌కు నడిచేది. ఇది కాకుండా వారంలో రెండు రైళ్లు బెంగళూరుకు నడుస్తున్నాయి. ఒకటి గుంటూరు మీదుగా... మరోటి రేణుగుంట మీదుగా వెళుతున్నాయి. ఈ ఏడాది కొత్తగా అరుణాచలం రైలు వేశారు. ప్రస్తుతం మైసూర్‌కు కూడా ఒక స్పెషల్ రైలు నడుస్తోంది. వీటిలో బెంగుళూరు రైలును రెగ్యులర్‌ను చేసి వారానికి రెండు రోజులు గుంటూరు మీదుగా నడపాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. వాటితో పాటు చర్లపల్లి ఎక్స్‌ప్రెస్‌ను రెగ్యులర్ చేసి వారానికి మూడు రోజులైనా నడిపితే హైద్రాబాద్‌కు రద్దీ తగ్గుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇవి కాకుండా ప్రస్తుతం వారంలో ఒక రోజు మాత్రమే అరుణాచలంకు రైలు వెళుతుంది. దీనికి టిక్కెట్లు రెండు నెలలు ముందుగా అయిపోతున్నాయి. దీన్ని రెగ్యులర్ చేసి వారంలో కనీసం రెండు రోజులైనా నడపాలని విన్నవించారు.

విశాఖ వెళ్లాలంటే ఇబ్బందే..

కొవిడ్‌కు ముందు నరసాపురం నుంచి రాత్రి పూట విశాఖకు రైలు ఉండేది. దీన్ని పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం లింక్ ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నారు. నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం నుంచి విశాఖ వెళ్లాలంటే భీమవరం వెళ్లి అక్కడ మచిలీపట్నం నుంచి వచ్చే రైలును ఎక్కాల్సి వస్తుంది. దీని వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ విశాఖను పునరుద్ధరించాలని డిమాండ్ చేసినా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర విభజన తరువాత వారణాశి ఎక్స్‌ప్రెస్‌ను ఏపీకి కేటాయించారు. అదీ ప్రస్తుతం విశాఖ నుంచి నడుపుతున్నారు. ఇది శ్రీకాకుళం, విజయనగరం వాసులకే అనుకూలంగా ఉంది. ఈ రైలును నరసాపురం నుంచి నడపాలని రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. దీనివల్ల ఉభయగోదావరి జిల్లా వాసులకు కాశీ ప్రయాణ కష్టాలు తీరతాయి. ఏదో సాకు చూపి రైల్వే దాట వేస్తోందే తప్ప ఈ రైలును నరసాపురం వరకు పొడిగించడం లేదు.

రైల్వే మంత్రికి వర్మ వినతులు

ఇటీవల కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ జిల్లాలోని రైల్వేపై ప్రత్యేక దృష్టి సారించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించడంలో ఎంతో కృషి చేశారు. అలాగే జిల్లాలోని ప్రయాణికుల డిమాండ్‌ను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నడు స్తున్న బెంగళూరు, చర్లపల్లి, అరుణాచలం ఎక్స్ ప్రెస్‌లను రెగ్యులర్ చేయాలని మంత్రికి విన్న వించారు. వీటితో పాటు విశాఖను పునరు ద్ధరించి, ఒక వారణాశి ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం నుంచి నడపాలని కోరారు. ఈ నేపథ్యంలో వచ్చే రైల్వే బడ్జెట్‌లో ఎన్ని కొత్త రైళ్లు పట్టాలెక్కు తాయన్నది ఆసక్తికరంగా మారింది.

శబరిమలైకు మరో 54 రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులు తమ దీక్షను విరమించడానికి శబరిమలై వెళ్తారు. వారి సౌకర్యార్థం వారి రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే శబరిమలైకు మరో 54 రైళ్లను నడుపుతుంది. రైల్ నెంబర్ 07109 కాకినాడ టౌన్ - కొట్టాయం ఈనెల 17 నుంచి జనవరి 19వ తేదీ వరకూ ప్రతి సోమవారం నడుపుతున్నారు. ఈ రైల్‌కు ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు. రైల్ నెంబర్ 07110 కొట్టాయం - కాకినాడ టౌన్ ఈ నెల 18 నుంచి జనవరి 20వ తేదీ వరకూ ప్రతి మంగళవారం నడుపుతున్నారు. ఈ రైలుకు ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు. రైల్ నెంబర్ 07111 నాందేడు - కొల్లాంకు ఈ నెల 20 నుంచి జనవరి 15 వరకూ ప్రతి గురువారం నడుపుతున్నారు. ఈ రైలుకు ఈ నెల 9వ తేదీ ఉదయం 8 నుంచి టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు. రైల్ నెంబర్ 07112 కొల్లాం జంక్షన్ - హెచ్‌ఎస్ నాందేడు ప్రతి శనివారం ఈ నెల 22వ తేదీ నుంచి జనవరి 17 వరకు నడుపుతున్నారు. 07113 చర్లపల్లి - కొల్లాంకు ఈనెల 18 నుంచి జనవరి 13 వరకూ ప్రతి మంగళవారం నడుపుతున్నారు. ఈ రైల్‌కు ఈనెల 9 ఉదయం 8 నుంచి టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. 07114 కొల్లాం జంక్షన్ - చర్లపల్లికి ప్రతి గురువారం ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు నడుపుతున్నారు. ఈ రైళ్లకు ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు.

రైళ్ల పొడిగింపు ఇలా..

ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. రైల్ నెంబర్ 04131 కాన్పూర్ సెంట్రల్ - ఎస్‌ఎంవీటీ బెంగళూరు ప్రతి ఆదివారం ఈ నెల 16 నుంచి ఈ నెల 30 వరకు పొడిగించారు. 04132 ఎస్‌ఎంవీటీ బెంగళూరు - కాన్పూర్ సెంట్రల్ ప్రతి బుధవారం ఈ నెల 19 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు పొడిగించారు. 07189 హెచ్‌ఎస్ నాందేడు - ధర్మవరం ప్రతి శుక్రవారం వెళ్ళే ఈ ప్రత్యేక రైలును డిసెంబరు 5 నుంచి జనవరి 27 వరకు పొడిగించారు. 07190 ధర్మవరం-హెచ్‌ఎస్ నాందేడు ప్రతి ఆదివారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలును డిసెంబరు 7 నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేదీ వరకు పొడిగించారు. 07059 సికింద్రాబాద్ - అనకాపల్లి ప్రతి సోమవారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలును ఈ నెల 10 నుంచి 24వ వరకు పొడిగించారు. 07060 అనకాపల్లి-సికింద్రాబాద్ ప్రతి మంగళవారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలు ఈ నెల 11 నుంచి 25 వరకు పొడిగించారు. 07003 చర్లపల్లి - ధర్మవరం ప్రతి ఆదివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 7 నుంచి 28వ వరకు పొడిగించారు. 07004 ధర్మవరం - చర్లపల్లి ప్రతి సోమవారం నడుస్తున్న ఈ రైలును ఈ ఏడాది డిసెంబరు 5వ తేదీ నుంచి డిసెంబర్ 26 వరకు పొడిగించారు. 07012 తిరుపతి - చర్లపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలును ఈ ఏడాది డిసెంబరు 6 నుంచి 27 వరకు పొడిగించారు.

రిజర్వేషన్ లేకుండా..

ఎలాంటి రిజర్వేషన్ లేకుండా ప్రత్యేక రైలును ఈనెల 10వ తేదీన రైల్ నెంబర్ 03404ను యశ్వంత్‌పూర్-భగల్‌పూర్ సోమవారం నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు ఎలహంక, హిందూపూర్, ధర్మవరం, డోన్, గుంటూరు, విజయవాడ, కొత్తవలస, విజయనగరం, బరంపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, బాదర్హ, బాలాసూర్, ఖరగ్‌పూర్, అందూర్, బత్తానగర్, బార్ధమాన్, రాంపూర్, బర్‌హర్వా, సాహిగంజి స్టేషన్లలో ఆగుతుందని స్లీపర్ క్లాస్, జనరల్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

క్రైం సమాచారం

వృద్ధుడి అనుమానాస్పద మృతి



లక్ష్మణరావు మృతదేహం

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒక గుడి వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వృద్ధుడు రక్తపు వాంతులు చేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు ఫిల్‌హౌస్‌పేటకు చెందిన డొల్లా లక్ష్మణరావు (64)కు 2011లో గుండెకు సంబంధించి స్టంట్స్ పడ్డాయి. మూడు నెలల నుంచి తూర్పువీధిలో ఉన్న సాయిబాబా గుడివద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా ఈనెల7వ తేదీ రాత్రి గుడి వద్ద రాత్రిడ్యూటీకి వెళ్లాడు. తెల్లవారుజామున మూత్ర విసర్జనకు వెళ్లిన అనంతరం రక్తపు వాంతులై అక్కడే పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ జి. సత్యనారాయణ, ఎస్ఐ వై.సుధాకర్, వారి సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కుమారుడు మద్యానికి బానిసయ్యాడని..
మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



సత్యనారాయణ మృతదేహం

మొగల్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుమారుడు మద్యం సేవిస్తున్నాడని మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్న వైనమిది. మొగల్తూరు హెచ్‌సీ ఎస్‌కేబీ సుభానీ తెలిపిన వివరాలివి.. సీతారామపురం నార్త్ గ్రామానికి చెందిన వాకా సత్యనారాయణ(72) మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున మొగల్తూరు కాలువపై గల బ్రిడ్జిపై ఉరి వేసుకుని మృతి చెంది వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుమారుడు నాగవెంకట కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఓ వ్యక్తి ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 7వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకకు చెందిన కరిగపాటి నాగరాజు(52) ఈనెల 2వ తేదీన తన గ్రామం నుంచి ఏలూరుకు మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో మాధవాపురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతడిని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ఎస్ఐ వి.నాగబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కోడికత్తుల తయారీదారుల అరెస్టు

పెదవేగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమయం సమీపిస్తున్న సమయంలో కోడి పందేలరాయుళ్లు కోడికత్తుల తయారీకి సన్నద్ధమయ్యారు. దీనిపై అందిన సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి, తయారీదారులను అరెస్టు చేస్తున్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం, విజయరాయి గ్రామాల్లో కోడికత్తులు తయారు చేస్తున్నారనే సమాచారంతో రెండుచోట్ల దాడిచేసి, ముగ్గురు తయారీదారులను అరెస్టు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వారివద్ద నుంచి 309 కోడికత్తులు, కత్తులు సానపెట్టే యంత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కొప్పులవారిగూడెంలో యర్రోజు రత్నాకర్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 109 కోడికత్తులు, సానపెట్టే యంత్రం, విజయరాయిలో సూదికొండ నాగాచారి, కొండేటి శ్రీనివాసరావులను అరెస్టు చేసి, వారివద్ద నుంచి 200 కోడి కత్తులు, సానపెట్టే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మెడికోలపై ఎలుక దాడి





- ఎలుకలను పట్టేందుకు లక్షలాది రూపాయల బిల్లుల చెల్లింపు
- నెలలో ఒక్క ఎలుకను పట్టిన దాఖలాలు లేవు
- చోద్యం చూస్తున్న ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు

ఏలూరు క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న మెడికల్ కాలేజీ హాస్టళ్లలో ఉంటున్నారు. మెడికల్ కళాశాల భవనాలు నిర్మాణాలు జరుపుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న పొదలను, చెట్లను కొట్టి వేయడంతో ఆ ప్రాంతంలో ఉన్న ఎలుకలు ఇతర విషపురుగులు ఆవాసాల కోసం ఆసుపత్రిలోకి, మెడికల్ కాలేజీలోకి చేరుకున్నాయి. ఒక ఎలుక ఆరుగురు విద్యార్థులను శనివారం తెల్లవారుజామున కరవడంతో వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ల మొదటి డోసు చేయించుకున్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో గతంలో మార్చురీలో ఉన్న ఒక మృతదేహాన్ని ఎలుకలు కళ్లు పీకివేసి తినివేయడంతో ఆ ఘటన రాష్ట్ర స్థాయిలోనే తీవ్ర సంచలనం కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఉన్న అన్ని ఆసుపత్రులలోను, మెడికల్ కళాశాల హాస్టల్స్‌లోనూ దోమలు, చీమలు, ఎలుకలు, పందికొ క్కులు, పాములు, విషపురుగులు రాకుండా ప్రతి రోజు రసాయనాలను, విషపురుగు మందులను పిచికారీ చేయాల్సి ఉంది. ఎక్కడైనా ఇవి ప్రవేశిస్తే వాటిని అవసరమైన వస్తువుల ద్వారా వాటిని బంధించాల్సి ఉంది. సాధారణంగా ఎలుకలకు గమ్ మ్యాట్స్‌ను వినియోగిస్తుంటారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎలుకల జోరు ఎక్కువగా ఉంది. అయినప్పటికి కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం, ఇక్కడ ఎలుకలు ఆసుపత్రిని, ఆసుపత్రి ఆవరణలో హాస్టల్స్‌ను తమ ఆవాసాలుగా మార్చేసుకున్నాయి. రోగులు తినేసి పడేసిన ఆహార పదార్థాలు తినడానికి ఎలుకలు, పందికొక్కులు వస్తూనే ఉన్నాయి. వీటిని బంధించడానికి గమ్ మ్యాట్స్‌ను, ఇతర వస్తువులను వినియోగించాల్సి ఉంది. కానీ ఆసుపత్రి ఆవరణలో ఈ మ్యాట్స్ ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. ఎలుక బొరియలను మూసివేయాల్సి ఉన్నా మనకెందుకులే అన్నట్టుగా ఎవరికి వారే ఉండడంతో రోజురోజుకూ ఎలుకల సంఖ్య పెరిగిపోతోంది. రాత్రి వేళ పడుకున్నారంటే శబ్దాలు చేసుకుంటూ ఎలుకలు తిరుగుతున్నాయని చెబుతున్నారు.

● కాంట్రాక్టర్ మాత్రం నెలనెలా లక్షలాది రూపాయల బిల్లులను ఆసుపత్రి అధికారులు మంజూరు చేస్తూ బిల్లులు చెల్లింపులకు సిఫార్సులు చేస్తున్నారు. వాస్తవానికి నెలకు ఎంత మెటీరియల్ వస్తుందో, ఎన్ని గమ్‌ప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారో ఏనాడూ లెక్కలు వేసిన అధికారులు ఒక్కరు కూడా లేరు. ఎంత మంది ఉద్యోగులు ఇక్కడ ఆ కాంట్రాక్టర్ తరపున ఉన్నారో, రోజుకు ఎన్ని ప్యాడ్స్ వినియోగిస్తున్నారో, ఏ మెటీరియల్ ఎంత వాడుతున్నారో పరిశీలించిన అధికారి లేనేలేరు. కేవలం బిల్లుల చెల్లింపునకు పర్సంటేజీలతో పని కానిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంతోదూరం నుంచి వచ్చి వైద్య విద్యను అభ్యసిస్తున్న వారికి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలుకల బారి నుంచి రక్షణ కల్పించాల్సి ఉంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఎటువంటి రక్షణ చర్యలు చేపడతారో చూడాల్సిందే.

బస్సు ఎక్కుతుండగా మహిళ మెడలో 3 కాసుల గొలుసు చోరీ

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దైవదర్శనం తర్వాత తిరుగుప్రయాణంలో బస్సు ఎక్కుతున్న ఓ భక్తురాలి మెడలోని మూడు కాసుల నానుతాడు, అరకాసు బరువైన సూత్రాలను గుర్తుతెలియని వ్యక్తి తస్కరించాడు. సూత్రాలు బస్టాండ్‌లో పడిఉన్నాయని ఆర్టీసీ కంట్రోలర్ బాధితురాలికిచ్చాడు. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం నరసింహరాజపుర అగ్రహారానికి చెందిన ముద్దన సీతామహాలక్ష్మి శనివారం దైవదర్శనం నిమిత్తం క్షేత్రానికి వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌లో బస్సు ఎక్కారు. రోడ్డుపైకి బస్సు వచ్చేసరికి మెడలో నానుతాడు, సూత్రాలు లేకపోయేసరికి కంగారుగా బస్సుదిగి లబోదిబోమంటూ స్టేషన్‌కు వెళ్లబోయింది. మార్గమధ్యలో కంట్రోలర్ వచ్చి సూత్రాలు అందజేసి బస్టాండ్‌లో దొరికాయని చెప్పాడు. ఆమె నానుతాడు చోరీపై ఫిర్యాదు చేసింది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ



దొరసానిపాడులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూస్తున్న రైతు కొండలరావు.

ద్వారకాతిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాపర్ వైరు కోసం కొంతమంది రైతుల ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి దొంగతనాలపై పోలీసుల నిఘా లేకపోవడమే కారణంగా రైతులు చెబుతున్నారు. మండలంలోని దొరసానిపాడులో ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయం పొలంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వసంచేసి కాపర్‌వైరును తస్కరించారు. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం తెల్లవారుజామున చూసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించారు. గ్రామానికి చెందిన రైతులు మద్దిపాటి చినకొండలరావు, చిలుకూరి హరిబాబు శుక్రవారం రాత్రి వరకు పొలంలోనే పనులు చేసుకున్నామని, ఇంటికి వచ్చి శనివారం ఉదయం పొలానికి వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసమై కన్పించాయి. రైతులు ముందుగా విద్యుత్ ఏఈకి సమాచారం ఇచ్చి అనంతరం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇప్పటికైనా ఇటువంటి దొంగతనాలపై దృష్టి సారించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఏఐ టెక్నాలజీతో నేర నియంత్రణ

జిల్లా వ్యాప్తంగా 5 వేల సీసీ కెమెరాలు : డీఐజీ



నూజివీడు రూరల్ సీఐ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

నూజివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం సాధారణ తనిఖీల్లో భాగంగా నూజివీడు డీఎస్పీ కార్యాలయం, నూజివీ డు రూరల్ సీఐ కార్యాలయాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ జిల్లాలో ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదువేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి నిఘాను కొనసాగిస్తామన్నారు. నూజివీడు డివిజన్ సర్కిల్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటును మరింత వేగవంతం చేయాలన్నారు. పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేసి త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాల న్నారు. గంజాయి కేసులు బాగా తగ్గాయని గతంలో నేరస్తులపై నిఘా ఉంచి నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ పూర్తయిందని శిక్షణ అనంతరం సిబ్బంది కొరత తగ్గుతుం దన్నారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, నూజివీడు సీఐలు రామకృష్ణ, సత్యశ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక వనసమారాధనలు : పద్మశ్రీ



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగు ల్లో ఐక్యతను ప్రతి బింబించటానికి కార్తీక వన సమా రాధనలు దోహద పడతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శనివారం ఏలూరు సమీపంలోని గోపన్నపాలెంలో మాగంటి రవిబాబు తోటలో జడ్పీ ఉద్యోగుల కార్తీక వనసమారాధన ఆహ్లాదంగా జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వన సమారాధనలు సమాజ సేవా భావనను పెంపొందిస్తాయన్నారు. జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె భీమేశ్వర్, ఘం టా ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓలు పీఎస్‌ఎస్ సింహాద్రిరావు, ప్రసాద్, రిటైర్డ్ ఎంపీడీఓ సుజాత, జడ్పీ ఏఓలు సీతామహాలక్ష్మి, భవాని, రజనీ ప్రభ, జాన్సన్, శ్రీనివాస్, కనకరాజు పాల్గొన్నారు. వన సమారాధనలో జడ్పీ ఉద్యోగులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు చైర్మన్ పద్మశ్రీ, సీఈవో శ్రీహరి బహుమతులను అందజేశారు.

11న మెగా జాబ్ మేళా

ఆగిరిపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆగిరిపల్లిలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. జితేంద్రబాబు తెలిపారు. 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 1135 మందికి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్‌ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బి. ఫార్మసీ, బి.టెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలున్నాయని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 83740 39719, 94916 94228, 99888 53335 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.



నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న వైసీపీ మహిళా విభాగం నాయకులు

మహిళలను కించపరచడంపై ఫిర్యాదు

నూజివీడుటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారంటూ నూజివీడు వైసీపీ మహిళా విభాగానికి చెందిన పలువురు నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నూజివీడు భవిష్యత్తు కోసం అని సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులు మహిళల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా పోస్టులను పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, ఆగిరిపల్లి ఎంపీపీ గోళ్ళ అనూష, వైసీపీ మహిళా విభాగం నాయకురాలు సుజనా కుమారి, స్వరూపరాణి, అత్తి పార్వతి తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరు రూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో హిందూ యువజన సంఘం, విజయ గుండె హాస్పిటల్ సంయుక్త సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైఎంహెచ్‌ఏ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి మజ్జి కాంతారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హృద్రోగ వైద్యుడు పి.రితీష్, నేత్ర వైద్యురాలు జి.తేజస్వి, జనరల్ ఫిజీషియన్ ఎం.రాంబాబు రోగులను పరీక్షిస్తారన్నారు. గుండె, నేత్ర జనరల్ వ్యాధులపై పరీక్షలు, ఈసీజీ, టూడిఏకో పరీక్షలు నిర్వహిస్తారని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నగరంలో డ్రోన్లతో నిఘా

అసాంఘిక కార్యకలాపాలు, రద్దీ ప్రదేశాలపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో శాంతి భద్రతలను కాపాడేందుకు అసాంఘిక శక్తులపై నిఘా పెంచేందుకు వినూత్న రీతిలో డ్రోన్లతో నిఘా పెంచారు. శనివారం రాత్రి జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో డ్రోన్ సిబ్బంది నగరంలో డ్రోన్లతో పరిశీలన చేశారు. నగర పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిరోధించే లక్ష్యంగా రద్దీగా ఉన్న ప్రదేశాలను, రహస్యంగా ఉన్న స్థావరాలపై నిఘా పెంచారు. పోలీస్ సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో సులభంగా పరిశీలన చేస్తున్నారు. విద్యా సంస్థల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిలు ఎవరైనా ఉన్నారా ? అని పరిశీలన చేస్తున్నారు. మొత్తం మీద శాంతి భద్రతలు కాపాడేందుకు డ్రోన్ కెమెరాలను పోలీస్‌శాఖ వినియోగిస్తూ పోలీస్ సైరన్, మైక్ ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు.


ఏలూరు నగరంలో డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

పేదల వైద్యానికి ఆర్థిక సాయం : ఎమ్మెల్యే చంటి


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ద్వారకానగర్‌కు చెందిన బి.మణి క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెకే అయ్యే వైద్యానికి ఖర్చు నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి లక్షా 75 వేలు రూపాయల ఎల్‌వోసీని అందజేశారు. క్యాన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకునే స్తోమతలేక ఎమ్మెల్యే బడేటి చంటిని ఆశ్రయించారు. వెంటనే ఆయన సీఎం సహాయ నిధి నుంచి నగదు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏలూరు నియోజకవర్గానికి ఇప్పటివరకు మూడున్నర కోట్ల రూపాయ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు అందజేశామన్నారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, తంగిరాల సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం : చింతమనేని


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకా రం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దుగ్గిరాలలో పలుగ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్లస్థలాల కోసం వినతులు అందించారు. దీనిపై స్పందించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో స్వలాభం కోసం పనికిరాని, గ్రామానికి దూరంగా, నివాసయోగ్యం కానీ చోట్ల భూమిని అధిక మొత్తానికి కొనుగోలు చేసి, ఇళ్లస్థలాలు ఇచ్చారని, ఈమేరకు చాలాచోట్ల ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడ్డారని, కూటమి ప్రభుత్వం పేదలకు అనువైన ప్రదేశాల్లో స్థలాలు అందించడానికి కృషి చేస్తోందన్నారు. త్వరలోనే పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు.

అయ్యప్ప పడిపూజ సంతోషాన్నిచ్చింది : సొంగా


పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

లింగపాలెం, నవం బరు 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప పడిపూ జలో పాల్గొనడం సంతోషాన్ని చ్చిందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శనివా రం లింగపాలెంలో జరుగుతున్న అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన పూజల అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం రంగాపురానికి చెందిన గంధ్రాల సుబ్బారావు అనే తెలుగు దేశం కార్యకర్త అనారోగ్యానికి గురయ్యారని తెలుసుకుని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పుప్పాలవారి గూడెంకు చెందిన సాతునూరి శిఖామణికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందిం చారు. పడిపూజ కార్యక్రమంలో మల్లిర్జునరావు గురుస్వామి, సింగగూడెం సొసైటీ ఛైర్మన్ మోరంపూడి మల్లికార్జునరావు, రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

'ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'


జి.కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ రేగంటి

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు కోరారు. శనివారం జి.కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకట్రాజు ఆదేశాలతో మండలంలో జి.కొత్తపల్లి, నారాయణపురం, పిన్నాపురం, ఎం.నాగులపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో వీటిని ప్రారంభించామన్నారు. రైతులకు అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎ-గ్రేడ్ క్వింటాల్ ధాన్యం రూ.2389 ధర పలుకుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్సే శ్రీహరిరావు, ఘంటా నరసింహరావు, రాచమంటి శ్రీనివాసరావు, పోతన వెంకన్నబాబు, నూరానేని బంగారయ్య పాల్గొన్నారు.

త్వరలో డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో నియామకం

ఏలూరు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ఏళ్ల తరబడి రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పాలనాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఎట్టకేలకు ఇబ్బందులు తొలగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా డీఎంహెచ్‌వో కార్యాలయాలకు పదోన్నతులపై రెగ్యులర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల(ఏవో)ను నియమించడానికి రంగం సిద్ధమైంది. ఆ మేరకు ఇటీవలే డిపార్ట్‌మెం టల్ ప్రమోషన్స్ కమిటీ (డీపీసీ) అప్రూవల్ లభించడంతో గరిష్ఠంగా పదిరోజుల్లో ఏవోల నియా మకాలు జరుగనున్నాయని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కొన్నేళ్లుగా పీహెచ్‌సీల వైద్యులు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు ఇన్‌చార్జి ఏవోలుగా వ్యవహరిస్తున్నారు.

లక్ష్యంతోనే.. విజయం సాధ్యం

(5వ పేజీ తరువాయి)

బాలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. వారు గంటల తరబడి ఒంటరిగా ఫోన్లతో ఉంటే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందువల్ల నిత్యం పిల్లల ఫోన్లు, బ్యాగులు చెక్ చేస్తూ ఉండాలి.

ఫ్రెండ్లీ పోలీసింగ్

ఏదైనా సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సామరస్యంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకుంటే వారికది ఎంతో భద్రతగా ఉంటుంది.ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వినతులు స్వీకరిస్తున్నాం. కిందిస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చు.సీసీ కెమెరాలు,డ్రోన్ కెమేరాలతో పర్యవేక్షించి బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రజల శాంతి భద్రత లకు విఘాతం కలిగించే ప్రతీ వారిపై, చిన్న చిన్న గొడవలు, అల్లర్లు సృష్టించే ప్రతీ వారిపై కేసులు నమోదు చేస్తాం.

నిబంధనలు బేఖాతర్!

(5వ పేజీ తరువాయి)

మీనమేషాలు లెక్కిం చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం క్యాంపస్‌లోని ఫ్యాన్సీ దుకాణాలలో ఆహార పదార్థాల విక్రయించకూడదు. అయితే ఫ్యాన్సీ వస్తువు ల విక్రయాలు లాభసాటిగా లేవని ఆహార పదార్థాల విక్రయం చేయక తప్పడం లేదంటూ ఆహార పదా ర్థాలను బయట నుంచి దిగుమతి చేసుకొని విక్రయిం చడం విశేషం.గతంలో మాదిరి ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే బాధ్యులు ఎవరనే ప్రశ్న వ్యక్తమవుతోంది.

డబ్బులు పంచాయతీకి.. జబ్బులు ప్రజలకా..?

చెరువులో చనిపోయిన గురసలు.. దుర్వాసనతో స్థానికులకు ఇక్కట్లు..

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాటచెరువులో గురస చేపల నిర్మూలనకు పురుగుమందును స్ప్రే చేయడంతో అవి చనిపోయి పైకితేలి దుర్వాసన వెదజల్లుతున్నాయి. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా పంచాయతీ అధికారులు లేదా పాటదారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. దేవినేనివారిగూడెంలో పెండ్లివాని చెరువులో చేపల పెంపకానికి పాటదారుడు రెండేళ్లకు పాడుకున్నాడు. చెరువులో మేతగా వ్యర్థాలను వేయకూడదనే నిబంధన మేరకు గురస చేపలను నిర్మూలించేందుకు శుక్రవారం నీటిలో పురుగుమందును స్ప్రే చేయించాడు. ఉదయానికి చేపలు మొత్తం చనిపోయి దుర్వాసన వస్తుంది. దీనివల్ల రోగాలు మరింతగా ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దేవినేనివారిగూడెం చెరువులో చనిపోయి తేలిన గురస చేపలు


మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కృష్ణ, సిబ్బంది

ఆర్థరైటిస్‌ను అశ్రద్ధ చేయొద్దు : డాక్టర్ కృష్ణ

ఏలూరు రూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆధ్వర్యంలో ప్రతీనెలా రెండో శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ పేదలకు వైద్యసాయం అందిస్తున్నట్టు ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు, విలువైన రక్త పరీక్షలతో పాటు మందులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చిన్న వయస్సులోనే ప్రతీ ఒక్కరిలో ఎముకల అరుగుదల కనిపిస్తుందన్నారు. ఆహారపు అలవాట్లు మార్పులతో ఆర్థరైటిస్‌ను నివారించవచ్చన్నారు మోకాళ్ల నొప్పులను అశ్రద్ధ చేస్తే ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.


వెయిట్ లిఫ్టర్లను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

వెయిట్ లిఫ్టింగ్‌లో ఇద్దరికి పతకాలు

ఏలూరు రూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రాంగణంలోని ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ సెంటర్ లిఫ్టర్లు వి. ఈశ్వర్‌కుమార్, 110+కేజీల విభాగంలో బంగారు పతాకం, ఆర్.అను 53 కేజీల విభాగంలో వెండి పతకం సాధించారు. మంగళగిరిలో గతనెల 24 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌ఏ అజీజ్, కోచ్‌ను క్రీడాకారులను అభినందించారు.

'అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుక్కునూరు మండలానికి చెందిన కూటమి నాయకులతో ఐటీడీఏ అధికారులు నిర్వాసితుల నుంచి పెద్దఎత్తున కమీషన్ల రూపంలో దండుకున్నారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. స్థానిక నాయకులతో మాట్లాడుకుని సెటిల్‌మెంట్ చేసుకోవాలని అధికారులే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతికి పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి'

టి.నరసాపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఈనెల 17న జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ రాష్ట్రనేత విస్సంపల్లి సిద్ధుమాదిగ పిలుపునిచ్చారు. బంధంచర్ల గ్రామంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ మహానగరంలో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు వాసుచౌదరి, కొమ్ము ప్రసాద్, ఉప్పులూరి వెంకటేశ్వరరావు, సంజీవరావు, కృష్ణారావు, పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన ఏపీటీఎఫ్ నగరశాఖ నాయకులు

ఏపీటీఎఫ్ సంఘ అధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం సాయంత్రం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కె. ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీని వాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రత్నకుమార్, సుబ్బారావు, బెనర్జీ, సుహాసిని, కార్యదర్శులుగా పొట్టియ్య, వెంకటేశ్వరరావు, సాంబమూర్తి, లలిత, సాంబమూర్తి, జిల్లా కౌన్సిలర్లుగా ప్రసాద్, వెంకటరత్నం, శ్యామల, కుమార్, రాజారావు, మూర్తి, అబ్బులు, శాంతికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

'వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

జంగారెడ్డిగూడెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, రైతు రక్షణ కోసం ఉద్యమాలు సాగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో రైతు సంఘం 23 మహాసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాల స్థానంలో కొత్త చట్టాలు తీసుకువస్తూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని కుట్ర పన్నుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల వ్యవసాయ రంగం పూర్తిగా నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితర జిల్లా నాయకులు, రైతులు పాల్గొన్నారు.


గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో వాలీబాల్ సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

వ్యాయామ కాలేజీలో వాలీబాల్ సెమినార్

దెందులూరు,నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : క్రీడా విద్యార్థులు క్రీడల్లో మెలకువలు తెలుసుకుంటూ నిరంతర సాధనతో ముందుకు వెళ్లాలని సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నతానియాల్ అన్నారు. శనివారం గోపన్నపాలెం వ్యాయామ కాలేజీ ఆవరణలో వాలీబాల్ సెమినార్ కన్వీనర్ వై పోలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో వాలీబాల్ కోచ్ వైవీ రమణ ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. వ్యాయామ విద్యార్థులు పాల్గొన్నారు

ఆయుర్వేద వైద్యంతో వ్యాధుల నిర్మూలన


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య నిపుణులు నగేష్

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యం, వ్యాయామం చేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు పూర్తిగా నిర్మూలన అవుతాయని ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బీవీ ఎం.నగేష్ తెలిపారు. లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు శనివారం పాతశివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 118 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ జరిపి మందులు అందించారు. వ్యాయామం ద్వారా త్వరితగతిన వ్యాధులు నిర్మూలన అవుతాయని స్పష్టం చేశారు. శిబిరంలో స్థానికులు పండరీనాథ్, అజయ్‌కుమార్, సురేష్‌కుమార్ బృందం సేవలందించారు.

ఆధ్యాత్మికం

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

నిడమర్రు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భువ్వనపల్లి బాలవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తన్నీడి వాసు ఆధ్వర్యంలో సుమారు వందకు పైగా జంటలు పాల్గొన్నాయి. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. జనసేన నాయకుడు పత్సమట్ల భీమరాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంబాబు అర్చకత్వంలో నిర్వహించారు.

పట్టిసీమ శివక్షేత్రంలో భక్తుల రద్దీ

పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రానికి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. కార్తీక మాసం పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో సీహెచ్ వెంకటలక్ష్మి అల్పాహారం, అన్నదానం, తీర్థప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ మహిళలు పులిహోర, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా బాట గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం

టి.నరసాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటగంగానమ్మ ఆలయ 27వ వార్షికోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి భక్తులు ఉదయం నుంచి విశేషపూజలు నిర్వహించారు. బొర్రంపాలెం, సింగరాయపాలెం, వల్లంపట్ల, గ్రామాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

14న లక్ష పత్రి పూజ

కామవరపుకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నేపథ్యంలో ఈనెల 14వ తేదీన ఉప్పలపాడులోని అన్నపూర్ణా దేవీ సమేత విశ్వేశ్వరాలయం వద్ద లక్ష పత్రి పూజ, కార్తీక వన సమారాధన నిర్వహి స్తున్నట్టు అర్చకులు ఇలపర్తి శివరామయ్య ప్రసాద్ తెలిపారు. సామూహిక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తా మన్నారు. కామవరపుకోట పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు విచ్చేయాలన్నారు.


యజ్ఞ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

దుర్గామారెమ్మ ఆలయ వార్షికోత్సవం

పెదవేగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే శ్రీదుర్గామారెమ్మ ఆలయ వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురంలోని దుర్గామారెమ్మ ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు, యజ్ఞ క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కొప్పిశెట్టి భవానీ మాట్లాడుతూ ఆలయ పునిర్నిర్మాణానంతరం వార్షికోత్స వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయని, 108 కలశాలతో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించామని వివరించారు. చివరిగా అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యవతి, రత్నం, ధనలక్ష్మి, శేషారత్నం, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో భక్త కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

భక్త కనకదాసు జీవితం ఆదర్శనీయం : కలెక్టర్

ఏలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : విశిష్టమైన కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా పేరొందిన భక్త కనకదాసు జీవితం మనందరికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తకనకదాసు చిత్రపటానికి వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన రచనలు, కీర్తనలు ప్రజలకు భక్తిని, మానవత్వాన్ని బోధించాయని కొనియాడారు. బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ పుష్పలత, డి.అశోక్‌కుమార్, గోపాల సత్యనారాయణ లు పాల్గొన్నారు.

11 నుంచి పంచాయతీల ఆదాయం పెంపుపై శిక్షణ

టి.నరసాపురం,నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.మణి కుమారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఈనెల 11, 12 తేదీల్లో మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గ్రామ పంచాయతీ ఆదాయ వనరుల పెంపుదలపై నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని ఆమె కోరారు.

వైఎంహెచ్‌ఏ సభ్యుడు నాగరాజమోహన్ మృతి


నాగరాజ మోహన్ (ఫైల్)

ఏలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) సభ్యులు సేవా తత్పరులు, లయన్ మోతే అంజ నాగరాజమోహన్(75) శనివారం తెల్లవారుజామున అగ్రహారంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. వైఎంహెచ్‌ఏ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యిరదల ముద్దుకృష్ణ, స్నేహమ్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబికా రాజా, మేనేజ్‌మెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేకే గుప్తా, వేమా కోటేశ్వరరావు, సభ్యులు నివాళులర్పించారు.

రేచర్లలో సారా స్వాధీనం

చింతలపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన జరబల ధనలక్ష్మి అనే మహిళ నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేసి సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలు స్కాన్ చేసి విక్రయాలు జరుపుతున్నారా ? లేదా అని తెలుసుకుని మరింత అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఎస్‌ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

ఏలూరు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సెల్ఫ్/సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో ఫేక్ టైంటేబుల్స్ సర్క్యులేట్ అవుతున్నాయని, జిల్లా విద్యాశాఖ జారీ చేసిన టైంటేబుల్‌ను మాత్రమే అనుసరించాలని సూచించారు. ఈ దఫా డీసీఈబీ ద్వారా ప్రైవేటు పాఠశాలల్లోని 9, 10 తరగతులకు ప్రశ్నపత్రాలను పంపిణీ చేస్తున్నామని, ఆ మేరకు డిమాండ్‌డ్రాఫ్టులు అందజేసిన ప్రైవేటు పాఠశాలల జాబితాల ప్రకారం ప్రశ్నపత్రాలను అందజేయాలని ఎంఈవోలను ఆదేశించారు.

గల్లంతైన అయ్యప్ప భక్తుడి మృతదేహం లభ్యం

కుక్కునూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):దాచారం గోదావరి తీరంలో శుక్రవారం గోదావరి స్నానానికి వెళ్లి కుమ్మరపల్లి నాగార్జున అనే అయ్యప్పస్వామి భక్తుడు గోదావరిలో గల్లంతైన విషయం విదితమే. ఈ క్రమంలో పోలీస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టగా గొమ్ముగూడెం గోదావరి తీరంలో అతడి మృతదేహం లభ్యమైంది. అనంతరం శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

నేడు వడాలిలో గౌడ సంఘం కార్తీక వనసమారాధన

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని సుభద్ర బలరామ సమేత జగన్నాథస్వామి దేవస్థానం ఆవరణలో కార్తీక వనసమారాధన జరుగనుంది. ఇందుకు కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య సమారాధన కమిటీ ఛైర్మన్ బొర్రా శేషుబాబు ఇతర సంఘ నాయకుల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కైకలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధితులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆచవరంలో ఇటీవల బుర్ర రామస్వామి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. శనివారం బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేసి కొత్తగా నిర్మించే ఇంటికి ఎలక్ట్రికల్ సామాన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆచవరం మాజీ సర్పంచ్ మాడపాటి చింతయ్య, గ్రామస్థులు బూరుబోయిన పాండురంగారావు, బోడావుల వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుపాన్‌లో నష్టపోయాం.. ఆదుకోండి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శనివారం అమరావతిలో సీఎంను కలిసి తుపాన్‌తో కైకలూరు నియోజకవర్గంలో పంటలు నష్టపోయాయని అలాగే ప్రధాన రహదారులు తీవ్రంగా ధ్వంసమయ్యాయని చంద్రబాబుకు వివరించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి నిధులను కేటాయించి సహకరించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై సీఎంతో చర్చించారు. త్వరలోనే సమీక్షించి సమస్యల్ని పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'పోతులూరి' పేరిట జిల్లాను ఏర్పాటు చేయాలి

కైకలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏదైనా ఒక జిల్లాకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పేరు పెట్టాలని కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తుపాకుల సోమాచారి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణకు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కమ్మరి పార్వతమ్మకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. జిల్లాల మార్పు జరుగుతున్నాయని కాలజ్ఞానం రాసిన వీరబ్రహ్మేంద్రస్వామి పేరు మీద జిల్లాను ఏర్పాటుచేసి ఆయనకు తగిన గౌరవాన్ని అందించాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వల్లూరి కాళీదాసు, వడ్లమన్నాటి దుర్గాప్రసాద్, సింహాద్రి సత్యనారాయణ, పట్నాల కొండప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అండగా సీఎం సహాయనిధి : మంత్రి

ఆగిరిపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్యం కోరం సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కొత్త ఈదర, సింగన్న గూడెం గ్రామాలకు చెందిన బెక్కం తిరుపతమ్మకు రూ.1.50 లక్షలు, గొట్టం పండుబాబుకు రూ. లక్ష ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబాలకు శనివారం విజయవాడ పార్టీ కార్యాలయంలో మంత్రి అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్. వేణు, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, కొలిపర సాంబశివరావు, దొండపాటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

నూజివీడు: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గాయపడిన వారికి తక్షణ వైద్యం అందుతుందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రమోదిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణా జిల్లా తరఫున ఎంపికైంది. ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో ఈ నెల 7న గూడూరులో జరిగిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో తన ప్రతిభ కనబర్చి త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృష్ణా జిల్లా జట్టులో స్థానం దక్కించుకుంది. శనివారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ శ్యామల, హెచ్ఎం రామోజీ, పీఈటీ రాంబాబు ఆమెను అభినందించారు.

మండవల్లి: స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి అండర్-14 బాలికల విభాగంలో గుడివాడ డివిజన్ బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. ఇందులో మండవల్లి మండలం లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బెండ టన్సీ కమల, కొత్తూరు మహి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో ఎంపికైనట్లు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటేశ్వరరావు తెలిపారు. స్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ బెండా సునీత, లోకుమూడి సర్పంచ్ కరేటి నాగమణి, ఎంఈఓ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుబాబును, విద్యార్థినులను అభినందించారు.

నూజివీడు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. వివేక్, ఉమామహేశ్వర్‌సింగ్, ఉమ్మడి కృష్ణా జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



నూజివీడు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికను నూజివీడు ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు, కోశాధికారి డి. వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సంఘ అధ్యక్షుడిగా బియ్యం సింగ్, కార్యదర్శిగా వి. స్టాన్లీ ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా పీపీ రంగారావు, కోశాధికారిగా రిచర్డ్, శేషయ్య, ఉపాధ్యక్షులుగా సత్య ప్రసాద్, మాధవరావు, ఏసుపాదంతో పాటు పలువురు కార్యవర్గానికి ఎన్నిక అయ్యారు.

సింగరాయపాలెంలో షష్టికి ముమ్మర ఏర్పాట్లు

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి గాంచిన ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి యున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26 నుంచి జరుగనున్న షష్టి కల్యాణ మహోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానంలో 13 రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాలకు నిత్యం వేలాది మంది దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఆలయంలో పుట్ట వద్ద పాలు పోసేందుకు, కేశ ఖండన శాలలో మొక్కులు తీర్చుకునేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. తొక్కిసలాటలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కైకలూరు బస్టాండ్ వద్ద కుక్కలకు భయపడి మహిళ పరుగు..



కలిదిండిలో సంచరిస్తున్న కుక్కల గుంపు



ఆగిరిపల్లిలో మాటేసిన కుక్కల గుంపు

భౌ..భౌ

బిక్కు..బిక్కు !

- విచ్చలవిడిగా వీధికుక్కల సంచారం
- కైకలూరు బస్టాండ్ వద్ద పరిస్థితి మరీ దారుణం
- తినుబండారాల కోసం బ్యాగుల్ని లాక్కెళుతున్న శునకాలు..

తరిమితే కరుస్తాయని బ్యాగుల్ని వదిలేస్తున్న ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

వీధి కుక్కల నియంత్రణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది.కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా మారాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రజా క్రీడా సముదాయాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి వీధి కుక్కలు చొరబడకుండా పకడ్బందీగా ఫెన్సింగ్ లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కుక్కల సంచారం, కుక్కకాటు ప్రమాదాలపై ఆంధ్రజ్యోతి పరిశీలనాత్మక కథనం..

కైకలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణ లేకపోవడంతో రహదారుల్లో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. కొన్నిచోట్ల చిన్నపిల్లలు, వృద్ధుల మీదకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జాతీయ రహదారులపై వాహనదారులను తరముతూ మొరుగుతూ భయపెడుతున్నాయి. దీంతో ఆ వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో అయితే ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. వీటితో పాటు రద్దీ ప్రదేశాల్లోనూ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు సైతం కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూనే ఉన్నాయి. కైకలూరులో ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రయాణీకులు వెళ్లాలంటే పది కుక్కలను తప్పించుకుని పరుగుతీయాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే ప్రధాన మార్గానికి అడ్డుగా కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తమపై ఎక్కడ దాడిచేస్తాయోనని బిక్కుబిక్కుమంటూ బస్టాండ్ ప్రాంగణంలో పరుగులు తీస్తున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల బ్యాగుల్ని తినుబండారాల కోసం లాక్కెళ్లిపోతున్నాయి. వాటిని తరమాలంటే కరుస్తాయనే భయంతో ప్రజలు వారి బ్యాగులను వదిలివేస్తున్నారు. జాతీయ రహదారిపై మాగంటి సెంటర్, ప్రభుత్వ కళాశాలల వద్ద, తాలుకా సెంటర్, మార్కెట్, రైతు బజా రు సెంటర్‌లలో విచ్చలవిడిగా కుక్కలు కనిపిస్తున్నాయి. వాహనాలకు, ప్రయాణీకుల రాకపోకలకు అడ్డుపడుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని జాతీయ రహదారి వెంబడి, బస్టాండ్ ఆవరణ, వివిధ ప్రధాన రహదారుల్లో, మాంసం దుకాణాల వల్ల కుక్కలు గుంపులు, గుంపులుగా ఏర్పడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పంచాయతీ అప్పుడప్పుడు కుక్కలను పట్టించి తరలిస్తున్నప్పటికీ తిరిగి కొంతకాలానికి అంతకు రెట్టింపు దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులను వెంటాడుతున్నాయి. గతంలో ఒక బాలికను వెంబడించి కుక్కలు కరిచిన ఘటన జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి బయట, రోడ్ల వెంబడి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ఆసుపత్రికి వెళ్ళే రోగులు కూడా భయపడుతున్నారు.

భయం భయంగా రోడ్లపైకి..

కలిదిండి: కలిదిండి రాష్ట్ర రహదారిపై యథేచ్ఛగా కుక్కలు గుంపులుగా సంచరించటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం జనంతో రద్దీగా ఉండే ఈ రహదారిపై కుక్కలు సంచరిస్తూ పలువుర్ని గాయ పరుస్తున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు రోడ్డుపైకి రావటానికి భయపడుతున్నారు. గొర్రెలు, మేకలను సైతం కరుస్తుండటంతో పెంపకం దారులు హడలెత్తిపోతున్నారు. కలిదిండి పీహెచ్‌సీకి వెళ్లే రహదారిపై నిత్యం కుక్కలు సంచరిస్తుండటంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కలిదిండి జడ్పీ హైస్కూల్ సమీపంలో కుక్కలు గుంపుగా సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రతి వీధిలో కనీసం 10 కుక్కలు తిరుగుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపైకి వెళ్లాలంటే గుండె దడగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు కుక్కల బెడదను తీవ్రంగా పరిగణించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

11న మెగా జాబ్ మేళా

ఆగిరిపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆగిరిపల్లిలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. జితేంద్ర బాబు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 1135 మందికి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బి. ఫార్మసీ, బి. టెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలున్నాయని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్, జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 83740 39719, 94916 94228, 99888 53335 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.



'అన్నే' సేవలు మరువలేనివి : కాపా

ఆగిరిపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నే నాగేశ్వరరావు సేవలను సేవలు అజరామమని రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు అన్నారు. కృష్ణవరం సర్పంచ్‌గా, పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఆయన సేవలు మరువలేనివన్నారు. నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆగిరిపల్లిలో ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపాతో పాటు అక్కినేని చందు, పాతూరి రవి, తోటపల్లి బాబు, మడుపల్లి గోపాలకృష్ణ కుమార్, సగ్గుర్తి రమేష్‌బాబు, పల్లగా నరసింహారావు, బీడీ రవికుమార్, పరిమి సాగరకుమార్, దేశబోయిన శ్రీనివాసరావు, తదితరులు ఆయన చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ

నూజివీడు టౌన్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థిని విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాల్గవ ఆంధ్ర గరల్స్ బెటాలిన్‌కు కలర్ బలేందర్ సింగ్ నేతృత్వంలో ఎన్‌సీసీ స్టాఫ్ రాజ్ మగడ్, పీవీపీ రెడ్డిలు శిక్షణ అందిస్తున్నారు. దాదాపు 160 మంది మహిళ క్యాడెట్లుకు శిక్షణ కొనసాగుతోంది.



రహదారిపై నడుస్తున్న దమ్ము ట్రాక్టర్

దమ్ము ట్రాక్టర్లతో రోడ్డు ధ్వంసం

చాట్రాయి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దమ్ము ట్రాక్టర్ల కారణంగా కోట్లాది రూపాయల ఖర్చుతో వేసిన రోడ్లు కొద్ది కాలానికే ధ్వంసం అవుతున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్ వరికోతలు జరుగుతుండగా, వెంటనే రబీ మొక్కజొన్న సాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. తుపాన్‌తో అధిక వర్షాల కారణంగా వరి పొలాలు బురదగా ఉండటంతో ట్రాక్ మిషన్లతో వరికోతలు కోస్తున్నారు. దీంతో భూములు గాళ్ళు పడుతున్నాయి. ఈ కారణంగా రైతులు దమ్ము ట్రాక్టర్లతో భూములు దమ్ము చేయించి ఆరిన తరువాత మొక్కజొన్న విత్తనాలు నాటుతారు. దీంతో దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకొని, రోడ్లను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఏఐ టెక్నాలజీతో నేర నియంత్రణ : డీఐజీ



నూజివీడు రూరల్ సీఐ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

నూజివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం సాధారణ తనిఖీల్లో భాగంగా నూజివీడు డీఎస్పీ కార్యాలయం, నూజివీడు రూరల్ సీఐ కార్యాలయాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ జిల్లాలో ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదువేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి నిఘాను కొనసాగిస్తామన్నారు. నూజివీడు డివిజన్ సర్కిల్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటును మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా దుకాణాల సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేసి త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి కేసులు బాగా తగ్గా యని గతంలో నేరస్తులపై నిఘా ఉంచి నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పూర్తయిందని శిక్షణ అనంతరం సిబ్బంది కొరత తగ్గుతుందన్నారు. అయితే నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సర్కిల్ పరిధి నుంచి సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, నూజివీడు సీఐలు రామకృష్ణ, సత్యశ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత చెరువు సమస్యను పవన్‌కు వివరిస్తా : జయమంగళ



బొమ్మినంపాడులో డెక్క, నాచుతో నిండిన మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మినంపాడు పంచాయతీ మంచినీటి చెరువు పూర్తిగా కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్న విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఆ చెరువు అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జయమంగళ హామీ ఇచ్చారు. శనివారం గ్రామంలో కార్తీక సమారాధనలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు పలువురు మంచినీటి చెరువు కలుషితమై రంగుమారి దుర్వాసన వెదజల్లుతున్న విషయాన్ని తెలిపారు. దీంతో ఆయన గ్రామస్థులతో కలసి ఆ చెరువును పరిశీలించారు. చెరువు పూర్తిగా డెక్క, నాచుతో నిండిపోయి దుర్వాసన వస్తున్న విషయాన్ని గమనించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. చెరువు సమస్యను పంచాయతీరాజ్ శాఖను కూడా నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించి చెరువును పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే రీతిలో అభివృద్ధి చేయిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు

కలిదిండి: కోరుకొల్లు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. శనివారం కోరుకొల్లు సొసైటీలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోరుకొల్లులో అధిక శాతం వరి సాగు చేస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. వరి సాగు లేని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేపడతామన్నారు. జయమంగళ మాట్లాడుతూ ఈ విషయం జేసీ దృష్టికి తీసుకెళ్లి కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో నగదు చెల్లింపు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీపీ వలవల రామకృష్ణ, సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, నాయకులు ఆముజాల బాబులు, బట్టు మహేష్, వలవల రమేష్, రైతులు పాల్గొన్నారు.

'టెట్ నుంచి మినహాయింపుపై కేంద్ర మంత్రితో మాట్లాడతా'

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో సర్వీసులో వున్న ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ పరీక్షనుంచి మినహాయింపునిచ్చేలా కేంద్రప్రభుత్వం వద్ద ప్రయత్నం చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను శనివారం కలుసుకుని అభ్యర్థించినట్టు ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ తెలిపారు. దేశంలో 2010 సంవత్సరానికి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరూ టెట్ రాయాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునివ్వడంతో టీచర్లు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని, అప్పట్లో వారంతా డీఎస్సీ ద్వారా ఎంపికైన వారేనని, 20 నుంచి 30 సంవత్స రాలుగా పనిచేస్తున్నా టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం సమంజసం కాదన్నారు. తమ అభ్యర్థనకు స్పందించిన ఎంపీ సత్య నారాయణ మాట్లాడుతూ టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపుపై చర్చించేందుకు ఇప్పటికే కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ తీసుకున్నానని, తప్పనిసరిగా మినహా యింపువచ్చేలా తనవంతు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చాట్రాయి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం సొసైటీ సభ్యుడైన చల్లగుళ్ల జగన్మోహన్‌రావు ఇటీవల కొత్తగూడెంలో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియల నిమిత్తం సొసైటీ ప్రెసిడెంట్ ఎర్ర ప్రసాద్‌రావు పదివేల రూపాయిల పోలవరం సొసైటీ బ్యాంక్ తరఫున బాధిత కుటుంబ సభ్యుడు చల్లగుళ్ల సురేష్‌కుమార్‌కి అందించారు. కొత్తగూడెం పంచాయతీ ప్రెసిడెంట్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు వెల్ది నాగేశ్వరరావు, మలకలపల్లి సుబ్రహ్మణ్యం, చల్లగుళ్ళ రాజారత్నం, చల్లగుల్ల విజయ్‌శేఖర్ పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త.. కేసు నమోదు

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడినందుకు తన భార్యను కొట్టి గాయపరచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామానికి చెందిన చండీరాణి ఈ నెల 7న అనారోగ్యానికి గురికాగా ఆమెను భర్త రవికుమార్ బైక్‌పై ఆసుపత్రికి తీసుకువెళ్తూ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు పరిచయమైన కైకలూరు మండలం వేమరప్పాడు గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తితో ఫోన్‌లో ఎందుకు మాట్లాడుతున్నావని బైక్ పై నుంచి ఆమెను కిందకు లాగి కొట్టి తీవ్ర గాయాలకు గురిచేశాడు. వెంటనే ఆమెను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన రామకృష్ణ ఆ వివాహితను వాడవల్లిలో కలిసి అసభ్యకరంగా ప్రవర్తించినందుకు అతనిపై ఆమె భర్త రవికుమార్ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడడం గమనించి ఆమెను కొట్టినట్టుగా చెప్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కలిదిండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లగూడెంలో శనివారం కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1620 నగదు, పుంజు, కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే 94407 96435కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నార్వే పారిశ్రామికవేత్తలు భారత్‌కు రావాలి

ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్

ఏలూరుటూటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నార్వే పర్యటనలో ఉన్న ఎంపీ మహేశ్‌కుమార్ బృందం శుక్రవారం పలు సమావేశాల్లో బిజీబిజీగా గడిపారు. ట్రోంసో నగరంలో వ్యాపారవేత్తలు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భారత్, నార్వే దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు సంబంధించి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్వే పారిశ్రామికవేత్తలను భారత్‌ను సందర్శించాలని ఆహ్వానించామన్నారు. అనంతరం ప్రేస్ట్ వానెట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ అమలవుతున్న విద్యావిధానంపై ప్రిన్సిపాల్, డైరెక్టర్, భారత ఎంపీలకు వివరించారు. నాలెడ్జ్ ప్రోగ్రాంలో భాగంగా నార్వే వెళ్లిన ఎంపీల బృందం పర్యటన శనివారంతో ముగిసింది.



నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న వైసీపీ మహిళా విభాగం నాయకులు

మహిళలను కించపరచడంపై ఫిర్యాదు

నూజివీడుటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారంటూ నూజివీడు వైసీపీ మహిళా విభాగానికి చెందిన పలువురు నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నూజివీడు భవిష్యత్తు కోసం అని సోషల్ మీడియా కు చెందిన వ్యక్తులు మహిళల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా పోస్టులను పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, ఆగిరిపల్లి ఎంపీపీ గోళ్ళ అనూష, వైసీపీ మహిళా విభాగం నాయకురాలు సుజనా కుమారి, స్వరూపరాణి, అత్తి పార్వతి తదితరులు ఉన్నారు.

లక్ష్యంతోనే.. విజయం సాధ్యం

(5వ పేజీ తరువాయి)

బాలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. వారు గంటల తరబడి ఒంటరిగా ఫోన్లతో ఉంటే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందువల్ల నిత్యం పిల్లల ఫోన్లు, బ్యాగులు చెక్ చేస్తూ ఉండాలి.

ఫ్రెండ్లీ పోలీసింగ్

ఏదైనా సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సామరస్యంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకుంటే వారికది ఎంతో భద్రతగా ఉంటుంది.ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వినతులు స్వీకరిస్తున్నాం. కిందిస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చు.సీసీ కెమెరాలు,డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించి బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రజల శాంతి భద్రత లకు విఘాతం కలిగించే ప్రతీ వారిపై, చిన్న చిన్న గొడవలు, అల్లర్లు సృష్టించే ప్రతీ వారిపై కేసులు నమోదు చేస్తాం.

నిబంధనలు బేఖాతర్!

(5వ పేజీ తరువాయి)

మీనమేషాలు లెక్కిం చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం క్యాంపస్‌లోని ఫ్యాన్సీ దుకాణాలలో ఆహార పదార్థాల విక్రయించకూడదు. అయితే ఫ్యాన్సీ వస్తువు ల విక్రయాలు లాభసాటిగా లేవని ఆహార పదార్థాల విక్రయం చేయక తప్పడం లేదంటూ ఆహార పదార్థాలను బయట నుంచి దిగుమతి చేసుకొని విక్రయించడం విశేషం.గతంలో మాదిరి ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే బాధ్యులు ఎవరనే ప్రశ్న వ్యక్తమవుతోంది.